teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 149 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 24 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం.. డౌన్‌లోడ్ చేయడం నేరం

కీలక తీర్పును వెలువరించిన సుప్రీం కోర్టు



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): అశ్లీల చిత్రాలను డౌన్‌లోడ్ చేయడం మరియు చూడటం అనేది లైంగిక నేరాల నుండి బాలల రక్షణ (పోక్సో) చట్టం ప్రకారం నేరమని, బాలలపై అత్యాచారాలను నిరోధించడానికి కఠినమైన చట్టంపై సుప్రీంకోర్టు ఈరోజు కీలక తీర్పును వెలువరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీని డౌన్‌లోడ్ చేయడం మరియు చూడటం పోక్సో చట్టం ప్రకారం నేరం కాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్ధివాలాతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. తీర్పు ఇవ్వడంలో హైకోర్టు 'తీవ్ర తప్పిదం' చేసిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.



## భక్తులు తిరుమల లడ్డూను అనుమానం లేకుండా తినొచ్చు

దోషాలు తొలిగించి లడ్డూ పవిత్రతను పునరుద్ధరించాం

ఈ మేరకు టీటీడీ ప్రకటన విడుదల

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంపై తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు కీలక ప్రకటన చేసింది. దోషాలు, దుష్ఫలితాలను తొలగించి శ్రీవారి లడ్డూ పవిత్రతను పునరుద్ధరించామని టీటీడీ తెలిపింది. భక్తులు తిరుమల లడ్డూను ఎలాంటి భయం, అనుమానం లేకుండా తినొచ్చన్నారు. లడ్డూ అపవిత్రం కావడంతో తిరుమలలో శాంతియాగం, సంప్రోక్షణ హోమాలు నిర్వహించామని తెలిపారు. తిరుపతి లడ్డూపై ఇప్పుడు ఎలాంటి సందేహాలు అక్కర్లేదని నాణ్యమైన నెయ్యితో లడ్డూ తయారీ చేస్తున్నామని తెలిపారు. కాగా, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు నాయడు సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిలో జంతు నూనె, పంది కొవ్వు ఉపయోగించారని ఆరోపించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపత్తి లడ్డూ కల్తీ జరిగిందన్న చంద్రబాబు వ్యాఖ్యలు దావనంలా వ్యాప్తి చెంది దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందన్న వార్తల నేపథ్యంలో భక్తులు మనోభావాలను దృష్టిలో పెట్టుకుని టీటీడీ చర్యలకు దిగింది. ఈ క్రమంలోనే తిరుమలలో శాంతి యాగాలు, సంప్రోక్షణ హోమాలు చేసి లడ్డూ ప్రవిత్రతను టీటీడీ తిరిగి పునరుద్ధరించింది.

# వన్ స్టేట్.. వన్ డిజిటల్ కార్డ్



రేషన్ కార్డుల స్థానంలో కుటుంబ కార్డుల యోచనలో ప్రభుత్వం

రేషన్, హెల్త్ ప్రొఫైల్‌తో పాటు పథకాలన్నిటికీ ఒకే కార్డు


పథకాలకు అర్హతలో ప్రాధాన్యత ఫ్యామిలీ కార్డులేనా..?

పైలట్ ప్రాజెక్టుకు చర్యలు చేపట్టాలంటూ సీఎం ఆదేశాలు

తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీపై మీనమేషాలు లెక్కిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తాం ఇస్తామంటూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చెబుతోంది. తాజాగా ఇప్పుడు సరికొత్త మెలిక పెట్టినట్లు తెలుస్తోంది. రేషన్ కార్డుల స్థానంలో కుటుంబ కార్డులు జారీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): అదే కార్డులో కుటుంబ హెల్త్ ప్రొఫైల్ కూడా పొందుపరచనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు త్వరలోనే కొన్ని చోట్ల ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు సిద్ధమైనట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఇవ్వాలనే యోచనలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ప్రతీ నియోజకవర్గంలో ఒక అర్బన్, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకుని పైలట్ ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని డాక్టర్

మిగతా 2 లో





## ములుగు జిల్లాలో క్షుద్రపూజలు కలకలం

భయాందోళనలో గ్రామస్తులు

అధికారులు పట్టించుకోవడం లేదంటూ వాపోతున్న స్థానికులు

ములుగు జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని బెస్తగూడెం గ్రామ సమీపంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. గ్రామంలోకి వెళ్లే మూల మలుపు వద్ద ఓ చెట్టుకి చీర కట్టి అక్కడ గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి క్షుద్ర పూజలు చేసినట్టుగా తెలుస్తోంది. ఘటనా స్థలంలో

మిగతా 2 లో

## హైడ్రా దూకుడుకు తెలంగాణ హైకోర్టు బ్రేక్

దుర్గం చెరువు కూల్చివేతలపై స్టే ఆదేశాలు జారీ

అభ్యంతరాలు వ్యక్తం చేసిన పిటిషనర్



.. వివరాలు 2లో

## బస్తీ దవాఖానాలకు అసమర్ధ ప్రభుత్వంలో సుస్తీ

ఎక్స్ (ట్విటర్)లో కేటీఆర్ ట్వీట్... విషజ్వరాలపై చర్యలు లేదంటూ విమర్శలు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): పట్టణ పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలనే ఉదాత్త సంకల్పంతో బీఆర్ఎస్ 400పైగా బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకువచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్)లో సోమవారం కేటీఆర్ ఒక

మిగతా 2 లో




## వచ్చే నెల నుంచి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం

పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి ఉత్తమ్ స్పష్టం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): వచ్చే నెల నుంచి రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యాన్ని ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పౌరసరఫరాలు, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కొత్తగా డిజిటల్ కార్డులు జారీ చేస్తున్నామని, ఈ కార్డు ద్వారా ఎక్కడైనా ఎప్పుడైనా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు తీసుకునే అవకాశం ఉందని, ఈ కార్డు ద్వారా పింఛన్ కూడా పొందవచ్చని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన

మిగతా 2 లో





## ఇది ప్రజా పాలన కాదు.. గూండా రాజ్యం..!

ప్రజల హక్కులను కాలరాస్తుందంటూ మండిపాటు

ప్రభుత్వంపై ధ్వజమెత్తిన హరీశ్‌రావు

మెదక్ జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ఈ రాష్ట్రంలో ప్రజా పాలన కాదు. గూండా రాజ్యం నడుస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల హక్కులను పూర్తిగా కాలరాస్తుందని మండిపడ్డారు. నర్సాపూర్

మిగతా 2 లో



## రాష్ట్రంలో రాగల మూడురోజుల వర్షాలు

హెచ్చరికలు జారీ చేసిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో రాగల మూడురోజుల పాటు భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నిన్నటి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోని

మిగతా 2 లో

## సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నూతన థర్మల్ విద్యుత్ ప్లాంట్

విద్యుత్ డిమాండ్ పెరుగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం




హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోన్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోబోతోంది. పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రాంతంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో సింగరేణి, జెన్‌కో సంయుక్తంగా

మిగతా 2 లో

## రాష్ట్రంలోని దేవాలయాలకు నెయ్యినే సరఫరా చేస్తాం

డెయిరీ డెలవప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు విజయ డెయిరీ నెయ్యినే సరఫరా చేస్తామని తెలంగాణ డెయిరీ డెలవప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాల సేకరణ రేటును మూడు సార్లు రూ.12.48 రూపాయలు పెంచారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాల సేకరణ రేటు పెంచడంతో పాల సేకరణ గణనీయంగా పెరిగిందన్నారు. ఇక నుంచి విజయ డెయిరీ పాల అమ్మకాలు

మిగతా 2 లో





## రుణమాఫీ కాని రైతులకు మంత్రి పొన్నం కీలక సూచన

రుణమాఫీ కాని రైతులెవరూ ఆందోళన చెందద్దు

అర్హులైన రైతులందరికి మాఫీ చేసి తీరుతాం

.. వివరాలు 2లో

# ములుగు జిల్లాలో క్షుద్రపూజలు కలకలం



**మొదటి పేజీ తరువాయి**

కుంకుమ, పసుపు, నిమ్మకాయలు పేర్చి, కోడిని కోసి వదిలిపెట్టిన ఆనవాళ్లు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. రోడ్డుపై ముగ్గేసి క్షుద్ర పూజలు చేసినట్లుగా ఆనవాళ్లతో పాటు దాని చుట్టూ రక్తపు మరకలు ఉండటం చూసిన గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. చెట్టుకు చీర కట్టి క్షుద్ర పూజలు చేసినట్టు స్పష్టంగా కనిపిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇలా గ్రామానికి వెళ్లే దారిలో క్షుద్ర పూజలు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. గ్రామంలోకి రావాలన్నా ఆ..దారి నుంచి రావాల్సి ఉంటుందని తెలిపారు. చిన్నారు కూడా అక్కడి నుంచే రావాల్సి ఉంటుందని, పిల్లలకు ఏదైనా జరిగితే పరిస్థితి ఏంటని తెలిపారు. ఇలాంటి క్షుద్ర పూజలు గ్రామానికి అరిష్టం చేయడానికే ఎవరైనా ఇలా చేస్తున్నారా? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు గ్రామస్తులు. తరచూ ఇదే ప్రదేశంలో క్షుద్ర పూజలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## హైడ్రా దూకుడుకు తెలంగాణ హైకోర్టు బ్రేక్




హైదరాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): హైడ్రా దూకుడుకు తెలంగాణ హైకోర్టు బ్రేకులు వేసింది. దుర్గం చెరువు కూల్చివేతలపై సోమవారం స్టే ఆదేశాలు జారీ చేసింది. ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దుర్గం చెరువు నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించారు. తమ అభ్యంతరాలను లేక్ ప్రొటెక్షన్ కమిటీ పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు, కూల్చివేతలు ఆపేయాలని స్టే ఆర్డర్స్ జారీ చేస్తూనే అక్టోబర్ 4న లేక్ ప్రొటెక్షన్ కమిటీ ముందు దుర్గం చెరువు నిర్వాసితులు హాజరు కావాలని ఆదేశించింది. ఆ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని అక్టోబర్ 4 నుండి ఆరు వారాల లోపు ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయాలని లేక్ ప్రొటెక్షన్ కమిటీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో దుర్గం చెరువు పరిసర నివాసితులకు ఊరట లభించినట్లయ్యింది.

## బస్తీ దవాఖానాలకు అసమర్ధ ప్రభుత్వంలో సుస్తీ

yîTT<Š{ì □|J ÔásÁTy□sTT

ట్వీట్ చేశారు. అయితే తాము ఏర్పాటు చేసిన బస్తీదవాఖానాలను కూడా కాంగ్రెస్ సర్కారుకు సరిగా నడపడం చేతకావడం లేదని కేటీఆర్ విమర్శించారు. అనేక రకాల విష జ్వరాలతో నగరవాసులు నరకయాతన పడుతుంటే ఆదుకోవాల్సిన బస్తీ దవాఖానాలకే ఈ అసమర్ధ ప్రభుత్వంలో సుస్తీ చేసిందన్నారు. ప్రజారోగ్యంపై మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ రాజయ్య నేతృత్వంలో బీఆర్ఎస్ వేసిన కమిటీ సోమవారం గాంధీ ఆస్పత్రిని సందర్శించకుండా పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబలుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది.

## వచ్చే నెల నుంచి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం

**మొదటి పేజీ తరువాయి**

ఎంతోమంది. మేస్త్రీలు, ఇతర కూలీలు జీవనోపాధి కోసం ముంబై, ఇతర ప్రాంతాలకు వెళతారని, తిరిగి వారి స్వగ్రామానికి వచ్చి పింఛన్, రేషన్ తీసుకునేందుకు అవకాశం ఉండదని, అలాంటి వారు ఎక్కడినుంచైనా ఇవి పొందే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని, ఇందుకు అవసరమైన నిధులను కేటాయిస్తామని ఉత్తమ్ చెప్పారు. ఇప్పటికే శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పనులు పూర్తి చేసేందుకు 4వేల కోట్లకు పైగా నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, పాలమూరు రంగారెడ్డితోపాటు ఇతర ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు.

## సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నూతన థర్మల్ విద్యుత్ ప్లాంట్

**మొదటి పేజీ తరువాయి**

నూతన థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించనుంది. అయితే, ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి విధి విధానాలను సింగరేణి సంస్థతో కలిసి రూపొందించాలని స్టేట్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్, జెన్‌కోకు ఉత్తర్వులను జారీ చేసింది. అదేవిధంగా ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి పూర్తి డీపీఆర్ ను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించింది. కాగా, రామగుండంలో ఇది వరకే జెన్‌కోకు సంబంధించి 62.5 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంటు ఉన్నప్పటికీ అది శిథిలావస్థకు చేరడంతో అందులో ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ క్రమంలోనే అందులో పని చేసిన ఉద్యోగుల నుంచి కొత్త థర్మల్ ప్లాంట్ నిర్మించాలని భారీగా విజ్ఞప్తులు రావడంతో తాజాగా ప్రభుత్వం కొత్త ప్లాంట ఏర్పాటుపై స్టేట్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ నుంచి జెన్‌కోకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా మొత్తం మూడు థర్మల్ పవర్ ప్లాంట్లు ఉన్నాయి. అందులో మొదటిది భద్రాది థర్మల్ విద్యుత్ కేంద్రం, అది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఉంది. ప్రస్తుతం ఆ థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆపరేటర్‌గా తెలంగాణ జెన్‌కో వ్యవహరిస్తోంది. ఇక రెండోది తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్, ఇది పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఉంది. నేషనల్ థర్మల్ పవన్ కార్పొరేషన్ ఆ పవర్ ప్లాంట్‌కు ఆపరేటర్‌గా వ్యవహరిస్తోంది. ప్రస్తుతం అది పాతది అవ్వడంతో అక్కడ ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు. ఇక్కడే ప్రభుత్వం సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో కొత్త థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతోంది. ఇక మూడోదైన యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. ప్రస్తుతం 80 శాతం పనులతో పవర్ ప్లాంట్ నిర్మాణ దశలో ఉంది.

## రాష్ట్రంలోని దేవాలయాలకు నెయ్యినే సరఫరా చేస్తాం

**మొదటి పేజీ తరువాయి**

మరింత పెంచడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, సంక్షేమ హాస్టళ్లకు, పాఠశాలలకు, జైళ్లు, హాస్పిటల్స్‌కు అవసరమైన పాలు, పాల పదార్థాలు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. అలాగే పెండింగ్ పాల బిల్లులను కూడా త్వరలోనే చెల్లిస్తామని ఆయన చెప్పారు.

# సైబర్ నేరగాళ్లు మీ డబ్బులు దోచుకున్నారా..

## ఎవరికి, ఎలా ఫిర్యాదు చేయాలో తెలుసా



కంప్యూటర్, ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్, మొబైల్ ఫోన్ వంటి ఎలక్ట్రానిక్ డివైజ్‌లతో చట్టవిరుద్ధంగా పాల్పడే చర్యలను ఆన్‌లైన్ మోసాలు అంటారు. వీటిని చేయడం చట్టప్రకారం నేరం. ప్రస్తుత కాలంలో సైబర్ కేటుగాళ్లు క్రెడిట్ కార్డు, బ్యాంకు అకౌంట్ హ్యాకింగ్, ఫిషింగ్, విషింగ్ స్కామ్‌లకు పాల్పడి ప్రజల డబ్బును కొల్లగొడుతున్నారు. ఇలా సైబర్ దాడికి గురైప్పుడు భారత ఐటీ చట్టం ప్రకారం, దేశంలోని ఏ సైబర్ సెల్‌లోనైనా ఫిర్యాదు చేయవచ్చు.

### ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ ఫిర్యాదు

ఎవరైనా ఆన్‌లైన్ మోసానికి గురైతే భారత ఐటీ చట్టం ప్రకారం, దేశంలోని ఏ సైబర్ క్రైమ్ సెల్‌కైనా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే https://cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా కంప్లైంట్ చేయవచ్చు. 155260 నంబరుకు ఫోన్ చేసి ఆన్‌లైన్ మోసానికి సంబంధించిన ఫిర్యాదు చేయవచ్చు. అయితే ఈ నంబరు పని దినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే పనిచేస్తుంది.

### పోలీస్ కంప్లైంట్

ఆన్‌లైన్ మోసానికి గురైనవారు దేశంలోని ఏ సైబర్ సెల్‌లో అయినా ఫిర్యాదు చేయవచ్చు. అందుకు వీలుకాకపోతే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. కచ్చితంగా ఎఫ్ఐఆర్ ఫైల్ అయ్యేటట్లు చూసుకోవాలి. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే, నగర కమిషనర్ లేదా జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను సంప్రదించాలి.

### డెబిట్/ క్రెడిట్ కార్డు మోసానికి గురైతే ఇలా చేయండి

సైబర్ నేరగాళ్లు బ్యాంకింగ్, డెబిట్/ క్రెడిట్ కార్డు వివరాలను తస్కరించి మోసపూరిత లావాదేవీల ద్వారా డబ్బును కాజేస్తుంటారు. ఫిషింగ్ లింక్స్, హ్యాకింగ్ వంటి మార్గాల్లో ఇలాంటి మోసాలకు పాల్పడుతుంటారు. ఒకవేళ ఈ తరహా బ్యాంకింగ్ మోసాల బారిన మీరు పడితే, పోలీసులకు ఫిర్యాదు చేయడానికంటే ముందు మీ డెబిట్/ క్రెడిట్ కార్డును బ్లాక్ చేయాలి. ఆ తర్వాత మీ బ్యాంకుకు సమాచారం అందించాలి. బ్యాంకు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. తరువాత పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి.



K.Vishwanath M.Sc,MA,B.Ed, LLB
AdvocateCell:9603139387

### ఇవి సిద్ధంగా ఉంచుకోవాలి


మీరు సైబర్ క్రైమ్ సెల్‌కు ఫిర్యాదు చేసే ముందు, మీ వద్ద అన్ని సపోర్టింగ్ డాక్యుమెంట్స్ ఉండేలా చూసుకోవాలి. గత ఆరు నెలల మీ బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఎస్ఎంఎస్‌లు, సైబర్ ఫ్రాడ్స్ మీకు పంపిన స్పామ్ లింకులు, లావాదేవీకి సంబంధించిన వివరాలు సిద్ధంగా ఉంచుకుని, ఆ తరువాతే ఫిర్యాదు చేయాలి. అలాగే ఐడీ కార్డు, అడ్రస్ ప్రూఫ్‌ను కూడా అందజేయాల్సి ఉంటుంది. ఈ విధంగా తగు పత్రాలతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

### ఈ విషయాలు గుర్తించుకోండి

ఆన్‌లైన్ మోసానికి సంబంధించిన ఫిర్యాదు లెటర్‌ను సైబర్ క్రైమ్ సెల్ హెడ్ కు పంపాల్సి ఉంటుంది. అందులో మీ పేరు, చిరునామా, ఈ-మెయిల్ ఐడీ, ఫోన్ నంబరు వంటి వ్యక్తిగత వివరాలను పొందుపర్చాలి. ఆన్‌లైన్ మోసానికి సంబంధించిన నిర్దిష్ట రుజువులను, పత్రాలను సమర్పించాలి. అవే మీ కేసుకు తగిన సాక్ష్యాధారాలుగా ఉపయోగపడతాయి.

### 72 గంటల్లోగా ఫిర్యాదు చేయాలి

కస్టమర్ లేదా బ్యాంక్ ప్రమేయం లేకుండా, మాల్‌వేర్ సైట్‌లు, పబ్లిక్ వైఫై, ఏటీఎం స్కామర్ల వంటి థర్డ్ పార్టీల కారణంగా ఆన్‌లైన్ మోసం జరిగితే 72 గంటల్లోగా బ్యాంకుకు ఫిర్యాదు చేయాలి. అప్పుడే మీకు పరిహారం అందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మోసం జరిగినట్టు గుర్తించిన వెంటనే మీరు బ్యాంకు, సైబర్ క్రైమ్ సెల్‌కు ఫిర్యాదు చేయడం తప్పనిసరి. ఆలస్యం చేస్తే మీరే నష్టపోయే ప్రమాదం ఉంటుంది. సమస్య ఓ కొలిక్కి రాదు.



## వన్ స్టేట్.. వన్ డిజిటల్ కార్డ్



**మొదటి పేజీ తరువాయి**

బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సోమవారం వైద్యారోగ్య శాఖపై జరిగిన సమీక్షలో ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. పైలట్ ప్రాజెక్టుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. రేషన్, హెల్త్ ప్రొఫైల్‌తో పాటు సంక్షేమ పథకాలన్నిటికీ ఇకపై ఒకే కార్డు కింద ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. 'వన్ స్టేట్.. వన్ డిజిటల్ కార్డ్' విధానంతో ప్రభుత్వం ముందుకెళ్లాలనే యోచిస్తోంది. ఫ్యామిలీ డిజిటల్ కార్డుతో ఎక్కడైనా సంక్షేమ పథకాలను పొందేలా చర్యలు తీసుకుంటుందని సమాచారం. ఫ్యామిలీ డిజిటల్ కార్డుతోనే కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్య సేవలు అందించాలని సమావేశంలో చర్చించారు. ప్రతీ ఒక్కరి హెల్త్ పొఫైల్ ఉండాలన్న సీఎం ఆదేశించారు. అర్హులందరికీ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. 'ఫ్యామిలీ డిజిటల్ కార్డుల మానిటరింగ్‌కు జిల్లాలవారీగా ఒక వ్యవస్థ ఉండాలి. రాజస్థాన్, హర్యానా, కర్ణాటకలాంటి ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలి' అని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మరికొన్ని వైద్యారోగ్య శాఖ కార్యక్రమాలపై సీఎం, మంత్రులు చర్చలు



చేశారని సమాచారం. కాగా హెల్త్ కార్డు ప్రొఫైల్ కార్యక్రమం అనేది నాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఇది అధ్యయనం చేయాలని నాడు అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే కార్యక్రమాన్ని రేవంత్ సర్కార్ అమలు చేస్తుండడం విశేషం.

## ఇది ప్రజా పాలన కాదు.. గూండా రాజ్యం..!

**మొదటి పేజీ తరువాయి**

గోమారంలోని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నివాసంలో మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. సీనియర్ శాసనసభ్యులు, మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి ఇంటి మీద కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మొన్న సిద్దిపేటలో నా కార్యాలయం మీద దాడి కావచ్చు, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటి మీద దాడి కావచ్చు, నిన్న సునీత లక్ష్మారెడ్డి ఇంటి మీద దాడి కావచ్చు, రాష్ట్రంలో గూండాయిజం రాజ్యాన్ని తలపించే విధంగా పరిపాలన సాగుతుంది అని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణకున్న మంచి పేరును మంటగలిపి, ఈరోజు బీహార్‌లాగా తెలంగాణను మారుస్తున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నిన్న సునీతా లక్ష్మారెడ్డి మీద జరిగిన దాడి కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహంతో జరిగిన దాడి అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రెచ్చగొట్టే మాటలు రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలను ప్రతిపక్షాల మీద దాడి చేసే విధంగా ప్రోత్సహించినట్లు ఉన్నాయి. ఎమ్మెల్యే నివాసంలో లేనప్పుడు ఉద్దేశపూర్వకంగా దాడి చేయాలని, ఎమ్మెల్యే ఇంటి ముందు పటాకులు కాల్చడం, ఇంట్లోకి పటాకులు విసరడము ఇంట్లో ఉన్న వారిపై దాడి చేయడం హేయమైన చర్య అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఇప్పుడే ఎస్పీ, ఐజీతో మాట్లాడాను, వెంటనే కాంగ్రెస్ గూండాలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు దాడి చేశారన్న విషయం వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నది. అంతే కాకుండా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై కూడా దాడి చేసే ప్రయత్నం చేశారు. హెడ్ కానిస్టేబుల్ చేతిలోని ఫోన్ లాక్కోని నెట్టేస్తే, ఆయన కింద పడిపోయాడు. పోలీసులపై దాడి జరిగినా కేసు నమోదు చేయడం లేదు. కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. దేశంలో తెలంగాణ పోలీసులు అంటే మంచి పేరు ఉండేది కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి పోలీసులను చెడగొడుతున్నారని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

## రాష్ట్రంలో రాగల మూడురోజుల వర్షాలు

**మొదటి పేజీ తరువాయి**

అల్పపీడనం, దక్షిణ కోస్తా మయన్మార్‌లోని ఉపరితల ఆవర్తనం తూర్పు, పశ్చిమ ద్రోణితో కలిసిపోయి. సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశగా వంగి ఉంటుందని, దీని ప్రభావంతో రాగల 24గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడేందుకు ఛాన్స్ ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ క్రమంలో మంగళవారం నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్క భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షాలుపడే అవకాశం ఉందని హెచ్చరించింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలుపడుతాయని వివరించింది. ఈ క్రమంలో ఆయన జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## రుణమాఫీ కాని రైతులకు మంత్రి పొన్నం కీలక సూచన

కరీంనగర్ జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. రేవంత్ సర్కార్ మొత్తం మూడు దశల్లో రుణమాఫీ ప్రాసెస్ కంప్లీట్ చేయగా కొన్ని అనివార్య కారణాల వల్ల కొందరు రైతులకు రుణమాఫీ జరగలేదు. ఈ క్రమంలో రుణమాఫీ కాని రైతులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సూచన చేశారు. సెప్టెంబర్ 23 కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో మంత్రి పొన్నం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ ప్రభుత్వం పంట రుణం మాఫీ చేస్తోందని చెప్పారు. ఇప్పటి వరకు రుణమాఫీ కాని రైతులు గ్రామాల్లో ఏఈఓలకు సమాచారం ఇవ్వాలని కీలక సూచన చేశారు. ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తామని హామీ ఇచ్చిన పొన్నం.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజవర్గ అభివృద్ధిలో భాగంగా రోడ్ల నిర్మాణం, మరమత్తులు, బ్రిడ్జీల నిర్మాణానికి రూ.60 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇంకా అవసరం ఉంటే రెండవ విడతలో మంజూరు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో రోడ్డు సౌకర్యం లేని గ్రామం ఉండకూడదన్నదే తమ లక్ష్యమని అన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# వృద్ధుల సంరక్షణ పిల్లలదే!

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, న్యూక్లియర్ కుటుంబాల వైపు మళ్లడం వల్ల చాలా మంది వృద్ధులకు కుటుంబ సంరక్షణ లేకుండాపోయింది. కొన్ని కుటుంబాలకు బయటి సహాయం తీసుకోవడం తప్ప వేరే మార్గం ఉండదు. చాలా మంది వృద్ధులను నిర్లక్ష్యం చేయడం, విడిచిపెట్టడం వంటివి చేస్తారు. నానాటికీ పెరుగుతున్న వృద్ధుల జనాభాతో, వృద్ధాశ్రమాల ప్రాముఖ్యత ఈనాటి కంటే చాలా సందర్భోచితంగా ఉంది. వృద్ధాశ్రమం, పదవీ విరమణ గృహం అని కూడా పిలుస్తారు. ఇది నర్సింగ్, సహాయక జీవన సౌకర్యాలతో కూడిన నివాస సౌకర్యం వృద్ధుల కోసం రూపొందించబడింది. వారు తమ జీవన నాణ్యతను కాపాడుకోవడానికి భోజనం, హౌస్ కీపింగ్, వైద్యసంరక్షణ, వినోద కార్యకలాపాల నుండి అవసరమైన సహాయం, సంరక్షణను అందుకుంటారు. వృద్ధాశ్రమం ఉద్దేశం మరెక్కడా లేని వారికి, వారికి మద్దతు ఇవ్వడానికి ఎవరూలేని వారికి సురక్షితమైన స్వర్గధామం. వృద్ధాశ్రమం ప్రాథమిక లక్ష్యం వృద్ధులకు సహాయక, సంరక్షణ వాతావరణాన్ని అందించడం, వారి శారీరక మానసిక శ్రేయస్సును నిర్ధారించడం. వృద్ధాశ్రమాల సంఖ్య పెరగడానికి మొదటి, ప్రధాన కారణం మారుతున్న ప్రజల జీవనశైలి. పూర్వం కుటుంబాలు ఉమ్మడి కుటుంబాలుగా ఉండేవి. అక్కడ పెద్దలను గౌరవించేవారు, వారి పిల్లలు, మనుమలను చూసుకునేవారు. అయినప్పటికీ ఉమ్మడి కుటుంబాల ప్రారంభంతో వృద్ధులు తరచుగా తమను తాము రక్షించుకోవడానికి ఒంటరిగా మిగిలిపోతారు. పిల్లలు మంచి ఉద్యోగావకాశాల కోసం దూరమవుతారు. వృద్ధులు ఒంటరిగా, నిర్లక్ష్యానికి గురవుతున్నారు. దీనికి తోడు చాలా మంది యువకులు ఉద్యోగాల కోసం, తల్లిదండ్రులను వదిలి విదేశాలకు వలసవెళ్తున్నారు. దీని ఫలితంగా వృద్ధులకు సాంగత్యం, సంరక్షణ లభించే వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయి. మారుతున్న జీవనశైలి, పెరిగిన జీవనకాలపు అంచనా, పెరుగుతున్న జీవన వ్యయం, సమాజంలో మారుతున్న మహిళల పాత్ర వంటి వివిధ కారణాల వల్ల ఇవి బాగా ప్రాచుర్యం పొందాయి. వృద్ధాశ్రమలు సరైన పరిష్కారం కానప్పటికీ, వృద్ధులు సుఖంగా జీవించడానికి, వారికి అవసరమైన సంరక్షణను పొందేందుకు అవి సురక్షితమైన వాతావరణాన్ని అందిస్తాయి. సమాజం వృద్ధులపట్ల శ్రద్ధ వహించడం ప్రాముఖ్యతను గుర్తించి, వారు నిర్లక్ష్యం చేయబడ కుండా, వెనుకబడి ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకుంటాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ ఏజింగ్ ప్రకారం అరవై దాటిన వారిని వృద్ధులుగా గుర్తిస్తున్నప్పటికీ, నేడు దేశంలోని 140 కోట్ల జనాభాలో వృద్ధుల జనాభా 10 శాతానికి పైగా ఉన్నారు. 2036 నాటికి 15 శాతానికి అనగా సుమారు 22.7 కోట్లు పెరుగుతుందని అంచనా. 2050 నాటికి 20.8 శాతానికి అనగా సుమారు 34.7 కోట్లు రెండింతలు పెరుగుతుందని అంచనా. మన దేశం ఉమ్మడి కుటుంబ సంప్రదాయాలు విచ్ఛిన్నమై, సంస్థాగత సంరక్షణ మౌలిక సదుపాయాలు కూడా లేని సమయంలో వృద్ధాప్య జనాభా పెరుగుదలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో వృద్ధుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు, నిధులు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హెల్ప్ ఏజ్ ఇండియా నివేదిక ప్రకారం 2026 నాటికి దేశంలో వృద్ధుల సంఖ్య 17 కోట్లకు పైగానే పెరుగుతుందని అంచనా. ఈ నేపథ్యంలో వారి పట్ల ప్రభుత్వాలు సరైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భారతీయ సమాజం మెరుగైన భవిష్యత్తు దిశగా ప్రయాణించాలంటే- వృద్ధులను వదిలించుకోవాలన్న ఆలోచనల్ని వీడాలి. పెద్ద వయస్కుల అపార అనుభవాన్ని సమాజ హితానికి ఉపయోగించుకోవాలన్న విజ్ఞతతో వ్యవహరించాలి. వృద్ధాప్యంలో వినికిడి లోపం, కంటిశుక్లం, వక్రీభవన లోపాలు, వెన్ను, మెడనొప్పి, ఆస్టియో ఆర్థరైటిస్, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, డిప్రెషన్, దంత సమస్యలు, జీర్ణకోశం, మోకాళ్ళు, కీళ్ళనొప్పులు, బిపి, షుగర్, డిమెన్షియా వంటివి వృద్ధులలో కనిపించే అతి సాధారణ రుగ్మతలు. కానీ ఆరోగ్యకరమైన జీవనశైలితో ఈ సమస్యలను, పరిస్థితులను నివారించవచ్చు. ధైర్యం, గట్టి సంకల్పం వున్నవారు యోగ, నడక, వ్యాయామం చేస్తూ ఉత్సాహంగానే వుంటారు. అటువంటి వాతావరణాన్ని కుటుంబ సభ్యులే కల్పించాలి. ఈ సంవత్సరం 2024 లో థీమ్ కూడా అదే. అర్థవంతమైన సామాజిక సంబంధాలే వృద్ధుల ఆరోగ్యం, శ్రేయస్సుపై తీవ్ర ప్రభావం చూపుతాయి.

అందుకే వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడంతో పాటు కుటుంబ సభ్యులు వారి పట్ల ప్రేమగా వ్యవహరించాలి. అందుకు ప్రపంచ దేశాల్లోని యువత, ఆరోగ్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఐకాస పిలుపునిచ్చింది. వృద్ధాశ్రమాలు మన సమాజంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటాయి. మన పెద్దలకు ఓదార్పు, సంరక్షణను అందిస్తాయి. యువకులు ముఖ్యంగా వీటిని గమనించాలి. కుటుంబంతో లేనప్పుడు వృద్ధులు నివసించే చోటే వృద్ధాశ్రమాల్లో వారికి ఆహారం, నివాసం, వైద్యసంరక్షణ వంటి అవసరమైన సేవలను అందిస్తాయి. శిక్షణ పొందిన సిబ్బంది వృద్ధులను బాగా చూసుకునేలా చూస్తాయి. వృద్ధులు చదవడం, తోట పని, సమూహ ఆటలు వంటి కార్యకలాపాలలో పాల్గొంటారు. పండుగలు, పుట్టిన రోజులు, ప్రత్యేక కార్యక్రమాలు ఉత్సాహంగా జరుపుకుంటారు. కొంతమంది పెద్దలు శాంతి, సాంగత్యం కోసం ఈ గృహాలను ఎంచుకుంటారు. అందరూ వారి వయస్సు వారు ఉండటం వల్ల వారు మాట్లాడుకోవడానికి, వారి ఆలోచనలు పంచుకోవడానికి, ఒంటరితనం పోవడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయి. కొంత మంది పెద్దలు వారి పిల్లలను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక వృద్ధాశ్రమాలకు వెళితే, మరి కొంతమంది ఇంట్లో పోరు భరించక ఆశ్రమాలకు వెళుతున్నారు. ఈ వృద్ధాశ్రమా లలో అత్యవసర వ్యవస్థలు వంటి ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయి. వైద్యులు, కౌన్సెలర్లు క్రమం తప్పకుండా సందర్శించడం వల్ల వృద్ధులు ఆరోగ్యంగా ఉంటారు. వృద్ధాశ్రమాలు మనకు శ్రద్ధ, కరుణ, సామాజిక బాధ్యత గురించి బోధిస్తాయి. వృద్ధాశ్రమాలు భౌతిక సౌకర్యాలను అందజేస్తుండగా, చాలా మంది వృద్ధులకు తమ కుటుంబాల నుండి మానసికంగా డిస్‌కనెక్ట్ అయినట్లు భావించ వచ్చు. సమాజం తరచుగా వృద్ధాశ్రమాలను ప్రతికూలంగా గ్రహిస్తుంది.

# సీఎంకు ఒక న్యాయం సామాన్యులకు ఒక న్యాయమా..?



పాలకీడు, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): సీఎం అన్నకు ఒక న్యాయం సామాన్యులకు ఒక న్యాయమా.. అని టీఆరెస్ రాష్ట్ర యువజన నాయకులు పెరుమాల్ల సతీష్ అన్నారు. సోమవారం పాలకీడు మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా హామీలల్లో లేని హైడ్రా అనే కొత్త దానికి తెరలేపి సామాన్య ప్రజలపై దయ దక్షిణం లేకుండా వాళ్ళ ఇండ్లను కూడబెడుతూ వాళ్ళ ఇంటిలోని సామాగ్రిని కూడా బయటికి తీసుకునియ్యకుండా పోలీస్ వాళ్లను కాపలాగా పెట్టి దుర్మార్గ పనులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తుంది అని సీఎం రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఎఫ్టిఎల్ పరిధిలోని ఉన్న ఇంటిని కూల్చడానికి నెలరోజుల క్రితమే నోటీసులు ఇచ్చినా కూడా ఈ రోజుకి కూడా ఆ ఇంటిని ఏ అధికారి కూడా కూల్చడానికి రాలేదు కానీ పేద ప్రజలకు ఎటువంటి సమాచారం లేకుండా వాళ్ళ ఇండ్ల మీద హైడ్రా అనే అధికారులు పడి గర్భిణీ మహిళలు ఇండ్లలో ఉన్నా కూడా ఆ ఇండ్లను కూలుస్తుంటే వాళ్లు భయపడుతూ ఇండ నుండి బయటకు పరుగులు పెడుతున్నారు అని పేద కుటుంబాలు మొత్తం రోడ్డున పడుతున్నాయి అని కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల పేద ప్రజలు బాధ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. హైడ్రా అందరికి ఒకే రూల్స్ వర్తింపచేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రామారావు, నాగయ్య, అచ్చయ్య, నాగేశ్వరరావు రమేష్ నవీను రాము తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో రైతుబంధు

- అక్టోబర్ రేషన్ కార్డులు
- దసరా వరికి ఇందిరమ్మ ఇండ్లు, 500 బోనస్
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



దేవరకద్ర, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): త్వరలో రైతుబంధు వేస్తామని, అక్టోబర్ నుండి రేషన్ కార్డులు ఇస్తామని, దసరా నుండి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, త్వరలో క్వింటాల్ వరికి 500 బోనాస్ ఇస్తామని, జనవరిలో రేషన్ ద్వారా సన్న బియ్యం ఇస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మీ పథకం లో భాగంగా 500 లకే గ్యాస్ సిలిండర్ పథకం కార్యక్రమంకు సంబంధించి మండలనికి చెందిన లబ్ధిదారులకు అధికారులు, స్థానిక నాయకులతో కలసి ధ్రువీకరణ పత్రాలు అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి,

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా మహిళలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని,ఎన్నికల ప్రచారంలో ఆరు గ్యారెంటీలు ఇవ్వడం జరిగిందని కోరారు. అందులో భాగంగా మహిళలకు ఇప్పటికే ఉచిత బస్ సౌకర్యం గెలిచిన 2 రోజులకే అమలు చేయడం జరిగిందనిఅన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 10 లక్షల ఆరోగ్య శ్రీ, 500 లకే సిలిండర్ తదితర హామీలు నెరవేర్చమని తెలిపారు. ఇప్పటికే 98శాతం రైతులకు రుణాలు మాఫీ చేశామని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ రైతులకు సైతం సమస్యను పరిష్కరించి రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినప్పుడు 69 వేల కోట్లు అప్పు ఉంటే పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ నాయకులు ఏడు లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన అప్పుకు ప్రతినెల కాంగ్రెస్ ప్రభుత్వము 5 వేల కోట్ల రూపాయల మిత్తిని కడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. అనంతరం, మండలంలోని పలు గ్రామాలకు చెందిన 22 మంది కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను మరియు పలువురికి రైతు బీమా, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు అధికారులు, వివిధ గ్రామాల మహిళలు అభిమానులు పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లు సీజ్

**అక్రమంగా రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు**

**సిఐ శివకుమార్,ఎస్ఐ నరేందర్ వెల్లడి**





ఆత్మకూర్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలో రేచింతల గ్రామంలో శివారులోని ఊక చెట్టు వాగు నుంచి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక దొంగతనం చేయుచున్న ఇసుక ట్రాక్టర్లను మరియు ఆత్మకూరు పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ను ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్, సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ఐ నరేందర్ వారి బృందం ఆధ్వర్యంలో ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులపై బిఎన్ఎస్, పిడిపిపి యాక్ట్, మైనింగ్ యాక్ట్ కింద కేసులో నమోదు చేశాను. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోబడతాయని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

# ఆత్మకూరులో పెన్షన్ దారుల ఆందోళన

- ■ సమయానికి పింఛన్ ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం
- ■ ప్రతినెల 5వ తేదీలోగా ఆసరా పెన్షన్లు ఇవ్వాలి
- ■ కెసిఆర్ ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్లనే ఇస్తున్న నేటికీ పంపిణి
- ■ 4016 రూపాయలు పింఛన్ ఎప్పుడు ఇస్తారు..?
- ■ అధికారంలోకి రావడానికి మాయ మాటలు చెప్పిన కాంగ్రెస్
- ■ పెన్షన్ దారులకు మద్దతు తెలిపిన సిపిఐ



ఆత్మకూరు, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రతినెల 5వ తేదీ లోపు ఆసరా పెన్షన్లు ఇవ్వాలని ఆసరా పెన్షన్ దారులు రాస్తారోకో చేశారు ప్రతి నెల ఆలస్యంగా పెన్షన్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి ప్రతి నెల 5వ తేదీలోగా పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ శెట్టి, మోష, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ పెన్షన్ దారుల ధర్నాకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై నెల పెన్షన్లు ఆగస్టు నెల చివరి తేదీన ఇవ్వడం సరికాదన్నారు. ఆగస్టు నెల పెన్షన్ ఈనెల 23వ తేదీ వచ్చిన అధికారులు ఇవ్వకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ప్రతినెల వృద్ధులు వికలాంగులు వితంతువులు ఒంటరి మహిళలకు ఆసరా పెన్షన్ జీవనధారమని ఆలస్యంగా ఇవ్వడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు ప్రతి నెల 5వ తేదీలోగా పెన్షన్లు ఇవ్వకుంటే మండలంలోని ఆసరా పెన్షన్ దారులను సమీకరించి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్నికల హామీలు పెన్షన్ 4000 రూపాయలు పెంచుతామని ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిన ఇంకా జావ్యం సరికాదన్నారు. ఇట్టి కార్యక్రమంలో పట్టణ ఏవైఎఫ్ అధ్యక్షుడు రవి, దినేష్, రాములు,మన్నెమ్మ ఆసరా పెన్షన్ దారులు పాల్గొన్నారు.




# తిరుపతి లడ్డూ కల్తీ ఘటన పై రాస్తారోకో



అమరచింత, సెప్టెంబర్ (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. తిరుపతి దేవస్థానంలో లడ్డును అపవిత్రం చేసి హిందువుల మనోభావాలను దెబ్బ తీశారని అన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గత ప్రభుత్వం పాలక మండలి వాటిని తయారు చేసే విధంగా ప్రోత్సహించిన వారందరినీ కఠినంగా శిక్ష పడాలని ఏం.రాజు, క్యామ భాస్కర్ అన్నారు. తిరుమల దేవస్థానంలో అన్యమతస్తులను జాబులో నుండి తీసివేయాలని డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక క్యామ భాస్కర్, ఎస్.సత్యనారాయణ,ఎం.అశోక్ కుమార్,మంగలి నరసింహులు, నర్సింలు, కృష్ణ, మేరువరాజు, వెంకటస్వామి నరాల సిద్దు, రాములు, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి



**అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో**

మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): గ్రీవెన్స్ లో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి అధికారులు త్వరగా వాటి సమస్యను పరిష్కరించాలని అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రజావాణిలో రెవెన్యు 32, వ్యవసాయ శాఖ 09, మహబూబాబాద్ మునిసిపాలిటీ 11, గ్రామీనాభివృద్ధి 04 లతో పాటు వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన మొత్తం (133) దరఖాస్తులను ఆయా శాఖ అధికారులు పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రజావాణీ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి సుబ్బారావు, అడిషనల్ డి.ఆర్.డి.ఎ జయశ్రీ, సూపరిండెంట్ మదన్ మోహన్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు 36 వేల రూపాయల విరాళాలు



- ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో
- స్థానిక డిఐఈఓకు అందజేసిన కళాశాల ప్రిన్సిపల్ భాగ్య వర్ధన్ రెడ్డి

ఆత్మకూర్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వరద బాధితుల కోసం కళాశాల ప్రథమ సంవత్సర మరియు ద్వితీయ సమస్యల విద్యార్థులు తమ గ్రామాలలో విరాళాలు సేకరించారు. తమ వంతు కృషిగా సహాయ సహకారాలు మొత్తం 36,590 రూపాయలు సేకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ భాగ్య వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఏ.అంజయ్యకి అట్టి విరాళల రూపాయలను అందజేశారు. ఎక్కువ మొత్తంలో విరాళాలు సేకరించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బందిని మరియు విద్యార్థులను డిఐఈఓ అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో డిఐఓ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కన్హా లో యువ సమ్మేళనం

రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనం లో 3 రోజుల పాటు జరగనున్న యువ సమ్మేళనం ఈ రోజు ప్రారంభం అయ్యింది. ఈ సమ్మేళనానికి కన్హా శాంతివనం డైరెక్టర్ దాజి తో పాటు దేశ విదేశాల నుండి యువ క్రీడాకారులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర క్రీడలు, యువజన శాఖ మంత్రి మాన్సుక్ మాండవీయ మాట్లాడుతూ... ఇక్కడికి వచ్చిన యువ క్రీడాకారులు 3 రోజుల పాటు తమ జీవితం ఒక కొత్త అనుభూతిని పొందుతరన్నారు. మనం జీవితం లో ఉన్నంత శిఖరాలకు చేరుకోవాలంటే ముందు మనసు నిర్మలంగా ఉంచుకోవాలన్నారు. ధ్యానం ద్వారా మనసు, శరీరం నిర్మలంగా తయారవుతుందని, తద్వారా మనం చేరదాల్చిన గమ్యాన్ని సులువుగా చేరుకోవచ్చన్నారు. సక్సెస్ కు పెద్ద వారు చిన్న వారు అని ఉండదని జీవితం లో సక్సెస్ కావాలంటే ఎవరైనా కష్టపడటం వల్లే సాధ్యమన్నారు. జీవితంలో సఫలత చెందాలంటే గతం లో సఫలత చెందిన పెద్దలను ఫాలో అవ్వాలన్నారు. వారి జీవిత చరిత్రలను తెలుసుకోవలన్నారు. అనంతరం బ్యాట్మెంటన్ క్రీడా కారిణి పీవి సింధు జూమ్ ద్వారా తన సందేశాన్ని అందించారు.

# కేంద్ర నిర్ణయం మేరకు జోరుగా సభ్యత్వ నమోదు కార్యక్రమం




నారాయణ్ పేట జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): నారాయణ్ పేట జిల్లా లోని మక్తల్ నియోజక వర్గంలో బిజెపి రాష్ట్ర పిలుపుమేరకు భారతీయ జనతా పార్టీ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 11 వ వార్డ్, 163 మరియు 175వ బూత్ మక్తల్ మున్సిపాలిటీలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి, ముఖ్య అతిధిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య,బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి, మరియు ప్రారంభించారు. కేంద్రంలో నరేంద్రమోడీగారి నాయ కత్వం లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి భారతీయ జనతా పార్టీ కుటుంబంలో చేరేవిధంగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలనిఅన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని యువత ఆదర్శంగా తీసుకుని ఈ దేశం కోసం పనిచేయాలని 163, 175, బూత్ లలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి అర్బన్ మండల అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ కర్నె స్వామి బీజేపీ జిల్లా నాయకులు మల్లికార్జున్ సభ్యత్వ ఇంచార్జ్ ప్రసన్న బలరాం రెడ్డి మున్సిపల్ వైస్ చేర్మెన్ అఖిల రాజశేఖర్ రెడ్డి జిల్లా కిసాన్ మోర్చా నాయకులు వెంకటేష్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్, కుర్వ లింగం బీజేవైఎం టౌన్ అధ్యక్షులు పీకే నర్సింహా మరియు బీజేవైఎం ఉప అధ్యక్షులు మహేష్ సాగర్ రామ్ మాధవ్ నాగరాజ్ గౌడ్ పాల రఘు హన్మంత్ విద్యసాగర్ చందాపూర్ కొండ య్య, రంకుల ఆంజనేయులు,చెన్నపం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి నెల 5లోగా పింఛన్లు ఇవ్వాలని రాస్తారోకో

## మద్దతు తెలిపిన సిపిఐ



నారాయణ్ పేట జిల్లా, సెప్టెంబర్, 23 (తీన్మార్ న్యూస్): నారాయణ్ పేట జిల్లా, మక్తల్ నియోజక వర్గం, ఆత్మకూర్ మండలంలోని పింఛన్ దారులకు ప్రతినెల 5వ తేదీ లోగా ఆసరా పింఛన్లు ఇవ్వాలని ఆత్మకూరు మండల కేంద్రం గాంధీ చౌక్ లో ఆసరా పింఛన్దారులు రాస్తారోకో చేశారు. ప్రతినెల ఆలస్యంగా పింఛన్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి ఐదో తేదీలోగా పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ శెట్టి, మోష, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అక్కడికి చేరుకొని వారికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జూలై నెల పింఛన్లు ఆగస్టు నెల చివరి తేదీన ఇవ్వటం సరికాదన్నారు. ఆగస్టు నెల పింఛను ఈనెల 23వ తేదీ వచ్చిన అధికారులు ఇవ్వకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ప్రతినెల వృద్దులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి స్త్రీలకు ఆసరా పింఛన్లే జీవనాధారం అని ఆలస్యంగా ఇవ్వటంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి నెల 5వ తేదీల్లోగా పింఛన్ ఇవ్వకుంటే మండలంలోని ఆసరా పింఛన్దారులను సమీకరించి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఆసరా పింఛన్ రూ. నాలుగు వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిన ఇంకా జాప్యం సరికాదన్నారు. పట్టణ ఏఐ వై ఎఫ్ అధ్యక్షుడు రవి, వినేష్, రాములు, మణెమ్మ ఆసరా పింఛన్దారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని స్థానిక సంస్థల జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ తో కలిసి కలిసి పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖలకు జిల్లా కలెక్టర్ కేటాయించి ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (27) దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన పి.ఉపేందర్ ఎస్సీ కార్పొరేషన్ కింద సబ్సిడీపై ఆటో మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఈడీ ఎస్సీ కార్పొరేషన్ అధికారిక రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన ఎం.మల్లా రెడ్డి తన ఇంటిని దౌర్జన్యంగా కూలగొట్టి ఆక్రమించుకోవడానికి తనను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కు రాస్తూ వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. రామగుండం లోని కృష్ణ రామగుండం లోని కృష్ణ నగర్ కాలనీవాసులు ఏ.రాజేశం కృష్ణానగర్ లో ఎన్టిపిసి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గల్లీలో 30 అడుగుల రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణం చేశారని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇట్టి అక్రమ నిర్మాణాన్ని జిల్లా టాస్కోర్స్ కమిటీ, రామగుండం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి మండలం హనుమంతునిపేట గ్రామానికి చెందిన ఏ.లలిత తనకు 50 శాతం ఫిజికల్ డిసేబిలిటి ఉందని, తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన ఏ.బుచ్చమ్మ తమకు గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ లో ఉచిత విద్యుత్తు రావడం లేదని, కరెంట్ బిల్లు కూడా అధికంగా వస్తుందని, తన భర్త అనారోగ్యంతో ఉన్నారని, అధిక బిల్లు చెల్లించలేకపోతున్నామని తమకు గృహ జ్యోతి పథకం వర్తింపజేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎస్ఈ ట్రాన్స్ కో అధికారికి రాస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాలుగొన్నరు.

# టెక్నో విస్తా" కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే నాయిని



హనుమకొండ, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): హనుమకొండ, కిషన్ పురాలోని చైతన్య డిగ్రీ కాలేజ్ లో నిర్వహిస్తున్న "టెక్నో విస్తా" కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనా చేసి కార్యక్రమాన్ని ప్రారభించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి. ఇంజనీరింగ్ విభాగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంపోదించడంలో ఈ కార్యక్రమం విద్యార్థులకు వేదిక అని ఎమ్మెల్యే అభివర్ణించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానంలో ప్రతి ఒక్కరు రానించాలి. ఈ కార్యక్రమం ద్వారా మీరు కూడా అన్ని రంగాల్లో ప్రతిభ చూపిస్తూ దేశ భవిష్యత్తులో ఉపయోగపడేలా చూడాలి. సాంకేతిక పరమైన ఇలాంటి కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని,కళాశాల యాజమాన్యానికి ప్రత్యేక అభినందలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారంపై సమీక్ష నిర్వహిస్తాం

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కార స్వభావంపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలతో వచ్చిన ప్రజల పట్ల జవాబుదారీగా ఉండాలని అన్నారు. ప్రజావాణి, హైదరాబాద్ ప్రజాభవన్ నుండి వచ్చిన 49 దరఖాస్తులపై ప్రతి సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మండల పర్యటనలో గుర్తించిన సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మన పరిధిలో పరిష్కరించడానికి అవకాశం ఉన్న దరఖాస్తులు పరిష్కరానికి. కాలయాపన చేయొద్దని పేర్కొన్నారు. జిల్లా నలుమూల నుండి ధరణి సమస్యలు, రుణమాఫీ సమస్యలతో పాటు ఇతర సమస్యలపై 70 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణిలో సమస్య పరిష్కారానికి వచ్చిన దరఖాస్తులు కొన్ని కాటారం మండలానికి చెందిన రామిళ్ళ రాజబాబు అనే యువ కుడు బ్రాందీ షాపులలో కొన్ని రకాల బీర్లు, బ్రాందీ క్వార్టర్లు లభించ కుండా బెల్టు షాపులను తరలిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని పిర్యాదు చేయగా రెండు రోజులలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఎక్సైజ్ సూపరిన్ టెండెంట్ ను ఆదేశించారు. మహాముత్తారం మండలం, స్థంభంపల్లి గ్రామానికి చెందిన జాడి రాజయ్య అనే దివ్యాంగుడు రెండు కాళ్ళు పోలియో వ్యాధి వల్ల పనిచేయడం లేదని తనకు చార్జింగ్ త్రి చక్ర వాహనం మంజూరు చేయాలని చేసిన దరఖాస్తు ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం జిల్లా సంక్షేమ అధికారికి ఎండార్స్మెంట్ చేశారు. భూపాలపల్లి శాంతి నగర్ గ్రామానికి చెందిన కొంతమంది ప్రజలు సింగరేణి ఉపరితల ఘని నుండి బొగ్గు తీసేందుకు జరుగుతున్న పేలుళ్ల వల్ల తమ ఇండ్లు పాడవుతున్నాయని, పగుళ్లు వస్తున్నాయని, పేలుళ్ల వల్ల భయాందోళ నలు చెందుతున్నామని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం సింగరేణి అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామానికి చెందిన ప్రజలు తమ ఓటు హక్కు మున్సిపాలిటీల్లో ఉండటంతో రెండు వందలకు పైగా బోగస్ ఓట్లు గుర్తించడం జరిగిందని, వాటిని తొలగించాలని దరఖాస్తు చేయగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వెంటనే బోగస్ ఓట్లు తొలగించి నివేదిక అందించాలని ఆర్డిఓను ఆదేశించారు. భూపాలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 10వ వార్డు పుల్లూరు రామయ్య పల్లి వాసులు కొంతమంది గుడిసెల్లో నివసిస్తూ జీవనం సాగిస్తున్నామని తమకు మిషన్ భగీరథ మంచినీరు సరఫరా చేయాలని దరఖాస్తు చేయగా మిషన్ భగీరథ మంచినీరు అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తును సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్




ములుగు జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్., అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, ఆర్డీఓ కే. సత్య పాల్ రెడ్డి లతో కలసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్ కు సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.ఆయా శాఖల అధికారులు ఎప్పటిక ప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. వారం వారం వస్తున్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా

రెవిన్యూ శాఖ – 34
పెన్షన్లు – 6
ఇందిరమ్మ ఇళ్ల – 2
రుణాలు మంజూరు –6
ఇతర శాఖలకు సంబంధించినవి – 25
మొత్తం 73 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.

జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం అంశంపై శాఖలు, మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మండలంలో పెండింగ్లో ఉన్న సమస్యలు, వాటికి గల కారణాలు, పరిష్కరించేందుకు సిద్ధం చేసుకున్న ప్రణాళిక వివరాలను కలెక్టర్ తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ దరఖాస్తుల పై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య, డిసిఓ సర్దార్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈ డి తుల రవి, డిఈఓ పాణిని, సి పి ఓ ప్రకాష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రేవూరి శంకుస్థాపన



నడికూడ, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): సోమవారం నడికూడ మండలం పులిగిల్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్ డి ఎఫ్ నిధుల నుండి విడుదలైన 15 లక్షల రూపాయలతో చేపట్టినటువంటి అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులను పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రజలందరికీ సమక్షంలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకుల చేతుల్లో గ్రామాల్లో అభివృద్ధి నిరాదరణకు,నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి పాలనలో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ప్రగతి విప్లవం కొనసాగుతోందని అన్నారు. గ్రామాలలోని ప్రతి వార్డులోను ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడంతోపాటు, గ్రామాలలో మౌలిక వసతులను అభివృద్ధి పరచడం కోసం, అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలందరి సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాలు మరింత అభివృద్ధి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. గ్రామాల్లోని అంతర్గత రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఏళ్ల తరబడి మట్టి రోడ్లతో బురద మయమైన గ్రామాలలు నేడు సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లుగా ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని ఆ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి దక్కే విధంగా చేసే బాధ్యత నాది అన్నారు. అలాగే ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చినట్లుగా ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సారాధ్యంలో రైతులందరికీ 2 లక్షల రూపాయలు రైతు రుణమాఫీ చేసి రైతుల పక్షాన ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బి.ఆర్.ఎస్ నాయకుల పై కేసు కొట్టివేత



హన్మకొండ జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ఇటీవల పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బి.ఆర్.ఎస్ నాయకుల పై నమోదైన కోడ్ ఉల్లంఘన కేసును హనుమకొండ పీసీఆర్ కోర్టు సోమవారం కొట్టేసింది. ఈ కేసులో బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు రహీం, శ్రీను, రంజిత్, స్వామి, సుధాకర్ ల పై ఎన్నికల ప్రవర్తన, నియమావళిని ఉల్లంఘిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో ఏప్రిల్ లో నెలలో ప్రచారం చేశారనే ఆరోపణలపై హనుమకొండ పోలీసులు వారి పై కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణ కు రాగ ఉమ్మడి వరంగల్ జిల్లా బి ఆర్ ఎస్ లీగల్ సెల్ అధ్యక్షులు గుర్రాల వినోద్ కుమార్, వేణు పటేల్ మరియు లీగల్ సెల్ సభ్యుల వాదనల అనంతరం కేసును కొట్టి వేశారు. ఈ పార్టీ కార్యకర్తలు వారికీ న్యాయ సహాయం అందించేలా కృషి చేసిన మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ కి, న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు.

# సంపూర్ణ పోషకాహారం పై అవగాహన కల్పించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ములుగు జిల్లా, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): తల్లి, బిడ్డలకు సంపూర్ణ పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి .ఎస్. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమవేశ మందిరం లో పిల్లల పెరుగుదల పర్యవేక్షణలో భాగంగా జిల్లా స్థాయి లోహా పర్యవేక్షణ తో కూడిన అనుబంధ పోషకహారం పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ లకు సంయుక్తంగా శిక్షణ కార్యక్రమంనకు జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని పోషణ లోపంతో ఉన్న పిల్లలును నిరంతరం పర్యవేక్షణ చేయాలనీ సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ మరియు జిల్లా మహిళా అభివృద్ధి శాఖ లు, రెండు శాఖలు కలిసికట్టుగా పనిచేసి (0బి5) ఐదు సంవత్సరాలు పిల్లల అతి తీవ్ర మరియు తీవ్ర పోషకాహార లోపం మరియు బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారి ఆరోగ్యాన్ని పెంపొందించాలని రెండు శాఖల అధికారులకు ఆదేశించారు. పిల్లలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించి పోషకాహారం పై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. ముందుగా ఈ కార్యక్రమానికి స్టేట్ న్యూట్రిషన్ కన్సల్టెంట్ నరసింహా రావు పిల్లల పెరుగుదల పర్యవేక్షణలో భాగంగా పోశకాహార లోపంతో ఉన్న పిల్లల ను గుర్తించి వారిని కార్యక్రమంలో భాగం చేసి వారికి అందించాల్సిన పోషకాహార చికిత్సను వివరించారు.(0బి5) ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లల మరియు తీవ్రలోప పోషణ మరియు బరువు తక్కువ ఉన్న పిల్లల ఎదుగుదలకు పోషణ ఒక అడ్డంకిగా మారుతుందని, పిల్లలలో పోషకాహార లోపం రూపాన్ని, రూపుమాపడానికి లేదా తగ్గించడానికి వివిధ అనుబంధ పోషక ఆహార కార్యక్రమాలు రూపొందించబడుతున్నాయని తెలుపుతూ, పిల్లలలో పోషకాహార లోపాన్ని తగ్గించడం ద్వారా వయసు ఆధారిత ఎదుగుదలకు సంబంధించిన అభివృద్ధి పెంపొందించడం కొరకు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మరియు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్తంగా ఒక సమగ్రమైన కార్యాచరణను గ్రామ పరిధిలో






తయారు చేయడానికే, పర్యవేక్షణతో కూడిన అనుబంధ పోషకార కార్యక్రమం రూపొందించారని తెలిపారు.
అంగన్వాడి కేంద్రం వారిగా గుర్తించబడిన సామ్ పిల్లల జాబితాను రూపొందించి, ఆ పిల్లలకు ఆకలి పరీక్ష, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి ప్రత్యేకమైన ఆహారం అనగా బాలమృతం ప్లస్ ఇవ్వడం జరిగిందని ఈ ప్రక్రియ మంచి ఫలితాలు వచ్చాయని ఈ ట్రైనింగ్ లో తెలిపారు. పోషకాహారం లోపం ఉన్న పిల్లలను గుర్తించడం, వారిని బరువు తక్కువగా వర్గీకరించడం , ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం అలాగే వారికి హెల్త్ సప్లమెంటరీ అనుబంధ పోషకాహారం ఇవ్వడం, పిల్లలు ఎవరికైనా న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్ కు, అవసరమైతే రిఫర్ చేయడం అలాగే అటువంటి పిల్లలకు ఆరు నెలల వరకు ఫాలో అప్, చేయడం మొదలగు విషయాల పైన ఈ ట్రైనింగ్ లో వివరించడం జరిగింది. పల్లె బస్తి దవఖానలో జరిగేవి. ఎచ్ .ఎస్ .ఎన్. డి కార్యక్రమం కోసం మైక్రో యాక్షన్ ప్లాన్ తయారు చేయడం అలాగే అట్టి కార్యక్రమానికి మండల వైద్యాధికారి పాల్గొనేలా కోఆర్డినేట్ చేసుకోవాలని తెలిపారు. అంగన్వాడి టీచర్లు ఆశా కార్యకర్తలు కోఆర్డినేట్ చేసుకొని పిల్లల గ్రోత్ మానిటరింగ్ కొరకు పిల్లల జాబితాను తయారు చేసుకోవాలని అలాగే ఆరోగ్య తనిఖీలు, రిఫర్ వారి జాబితాను తయారు చేయాలని అటు తరువాత డిశ్చార్జ్ అయిన పిల్లలను ఆరు నెలల వరకు ఫాలో అప్ చేయడానికి హెల్త్ సూపర్వైజర్లు తగిన మద్దతు అందించాలని తెలిపారు. అతి తీవ్రత మరియు తీవ్రలోప పోషణ మరియు బరువు తక్కువగా ఉన్న పిల్లల జాబితాను న్యూట్రిషన్ మరియు హెల్త్ ట్రాకింగ్ సిస్టం నందు డేటాని నమోదు చేయాలని అట్టీ వారిపై రాష్ట్ర స్థాయిలో జిల్లా స్థాయిలో మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో రెగ్యులర్ గా రివ్యూలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఇంచార్జి డిడబ్ల్యూఓ శిరీష, డిఎం అండ్ హెచ్ఓ అప్పయ్య, విపిన్, సీడీపీఓ లు ప్రేమలత, ముత్తమ్మ,మెడికల్ ఆఫీసర్స్ , హెల్త్ సూపెర్వైసోర్స్ , మరియు సూపెర్వైసోర్స్ , పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని మీ సేవా కేంద్రాల్లోని సమస్య పరిష్కారం

## ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్

మహబూబాబాద్, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): గత కొన్ని రోజుల నుంచి %ాణజ% సర్వర్ సమస్య వల్ల, మీసేవ సర్వీసెస్ లో సాంకేతిక సమస్యలు వచ్చాయి. రెవెన్యూ కార్యాలయంలో మీసేవ నిర్వాహకులు మరియు దరఖాస్తుదారులు ఇబ్బందులకు గురి అయ్యారని, జూలై 10 నుండి సెప్టెంబర్ 12 మధ్య తేదీలలో వివిధ సర్టిఫికెట్ ల కోసం అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్‌లకు మీసేవ యాక్సెస్‌పై సాంకేతిక సమస్య ప్రభావం చూపిందని దీని వలన పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్‌ల బ్యాక్‌లాగ్ ఏర్పడిందని అట్టి సమస్య పరిష్కరించబడినదని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని పరిష్కరించడానికి %జూాణ% మీసేవ పెండింగ్‌లో ఉన్న అన్ని అప్లికేషన్‌లను మీ సేవ కేంద్రం ఆపరేటర్స్ లాగిన్‌లకు తిరిగి పంపించటం జరిగిందని మరియు దరఖాస్తుదారులకు సూచనలతో కూడిన సమాచారాన్ని %ామీా% రూపంలో పంపించటం జరిగిందని దరఖాస్తుదారులు ఎక్కడైతే మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకున్నారో అక్కడి మీసేవ కేంద్రానికి వెళ్లి సంబంధిత పత్రాలతో అప్లోడ్ చేయించుకోవాలని మరియు మీ సేవ ఆపరేటర్లు లు తప్పనిసరిగా పత్రాలను మళ్లీ అప్‌లోడ్ చేసి సమర్పించాలని సంబంధిత అధికారులు సమర్పించిన దరఖాస్తులను సమీక్షించి వాటిని ఆమోదిస్తారన్నారు. పునఃసమర్పణకు ఎటువంటి ఛార్జీలు ఉండవని సెప్టెంబర్ 13, 2024



తర్వాత దరఖాస్తులు సాధారణంగా ప్రాసెస్ చేయబడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సోమవారం మేనేజర్ బయ్యారం, గార్ల, డోర్నకల్ మండలాల లోని మీ సేవా కేంద్రాలలో ఆపరేటర్లు నిర్వహిస్తున్న ధరఖాస్తుల అప్ లోడ్ ప్రక్రియను పరిశీలించారు.

# ప్రభుత్వ పాలన విభాగంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం

హన్మకొండ కేయు, సెప్టెంబర్ 23 (తీన్మార్ న్యూస్): సోమవారం రోజున కాకతీయ విశ్వ విద్యాలయంలోని ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల విభాగం విద్యార్థులు మరియు పరిశోధకులు విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలన విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ తమ విధిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా పచ్చదనం పరిశుభ్రత పాటిస్తూ చెట్లను పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షిస్తూ సమాజ వికాసానికి పాటుపడాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగం



అధ్యాపకులు, ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, డాక్టర్ చీకటి శ్రీను,డాక్టర్ ఉమా శంకర్,డా. మోహన్,పరిశోధక విద్యార్థులు విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణిలో స్థానికత లొల్లి

- క్యాంపు ఆఫీస్ ఎదుట నిరుద్యోగుల ధర్నా
- 1100 మంది కార్మికుల్లో 200 మంది కూడా స్థానికులు లేరని ఆందోళన
- ఆర్జీ1 ఏరియా 5 ఇంక్లైన్‌లో 5 రోజులుగా నిలిచిన బొగ్గు ఉత్పత్తి

కోల్‌సిటీ: సింగరేణిలోని ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓబీ (మట్టి తొలగింపు), ఇతర పనులు నిర్వహిస్తున్న ప్రయివేటు కంపెనీల్లో స్థానికులకు 80శాతం ఉద్యోగాలు కేటాయించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయడం లేదని నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. పెద్దపల్లి జిల్లా ఆర్జీ1 ఏరియాలోని గోదావరిఖని 5 ఇంక్లైన్ ఓపెన్ కాస్టు మైన్‌లో ఓబీ పనులు నిర్వహిస్తున్న గుజరాత్‌కు చెందిన పీసీ పటేల్ కంపెనీ ప్రాజెక్టు క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం నిరుద్యోగులు ధర్నా చేశారు. ఓసీ-5 ప్రభావిత గ్రామాలైన సుందిల్ల, ముస్త్యాల, సింగిరెడ్డిపల్లి, గౌరెడ్డిపల్లి, గోదావరిఖని ఇతర గ్రామాల నిరుద్యోగులు, యువతకు పీసీ పటేల్ కంపెనీలో 80శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితులను పర్యవేక్షించారు. ఈ కంపెనీలో 1100 మందికి పైగా కార్మికులు పనిచేస్తుండగా 900వరకు స్థానికులకు అవకాశం దక్కాల్సి ఉండగా, కేవలం 200మంది మాత్రమే ఉన్నారన్నారు. కానీ పీసీ పటేల్ కంపెనీ మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్ నుంచి కూలీలను తెప్పించి



పని చేపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నుంచి వస్తున్న కాలుష్యాన్ని ప్రభావిత గ్రామాల ప్రజలు అనుభవిస్తుండగా దాని లాభాలు స్థానికేతరులకు దక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యం స్పందించి స్థానికేతర ఉద్యోగులను ఇక్కడి నుంచి తిరిగి పంపేయాలని కోరారు. ఆందోళనకారులు స్థానికేతర కూలీలతో మాట్లాడి ఇక్కడి పరిస్థితిని వివరించి వారి స్వస్థలాలకు వెళ్లాలని కోరారు. 5 రోజులుగా ఈ ఆందోళన కొనసాగుతుండటంతో ఓసీ 5వ గని నుంచి బొగ్గు ఉత్పత్తి నిలిచి పోయింది. రోజుకు 40 టన్నుల చొప్పున బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉన్నా అది నిలిచిపోవడంతో బొగ్గు నిల్వలు నిండుకుంటున్నాయి. మరో రోజు ఆందోళన ఇలాగే కొనసాగి ఉత్పత్తి నిలచిపోతే పలు విద్యుత్ కంపెనీలకు బొగ్గు సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉంది.

# 4500 ఫోన్ల ట్యాపింగ్

- ధ్వంసం చేసిన ప్రణీత్‌రావు..
- దృష్టి సారించిన స్పెషల్ టీం

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఎస్‌ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేసిన ట్యాపింగ్ వివరాలపై పంజాగుట్ట స్పెషల్ టీం అధికారులు ప్రత్యేకంగా దృష్టిని సారించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష కీలక కాంగ్రెస్ నాయకుల ఫోన్లతో పాటు మరికొందరు ప్రముఖుల ఫోన్లను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎస్‌ఐబీ అధికారులు ట్యాపింగ్‌కు పాల్పడటం సంచలనం రేపిన విషయం విదితమే. ఈ నేరంపై కేసును సీరియస్ అయిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు కోసం స్పెషల్ టీంను ఏర్పాటు చేసి రంగంలోకి దించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటి వరకు ఎస్‌ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావు, నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీలు బుజంగరావు, తిరుపతన్నలను స్పెషల్ టీం అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా, వారి విచారణలో అప్పటి ఎస్‌ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు తాము ఫోన్ ట్యాపింగ్‌ను జరిపినట్టు అరెస్టయిన నిందిత అధికారులు వాంగ్మూలమిచ్చారు. అయితే, ఇందులో అదనపు ఎస్పీ బుజంగరావుకు మాత్రం మధ్యంతర బెయిల్ లభించగా, మిగతావారు జైలులోనే ఉన్నారు. కాగా, ఈ కేసు వెలుగు చూసే కొద్దిరోజుల ముందు ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావుతో పాటు మరో నిందితుడైన ఐ న్యూస్ సీఈఓ శ్రవణ్ కుమార్‌లు దేశం విడిచి వెళ్లారు. తాను క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాకు వెళ్లాననీ, చికిత్స ముగించుకొని వస్తానంటూ ప్రభాకర్‌రావు ఇక్కడి అధికారులకు సమాచారమందించారు. అయితే, ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్‌ల కోసం కోర్టు అనుమతితో రెడ్‌కార్నర్ నోటీసును నగర పోలీసు కమిషనర్ తరఫున సీఐడీ అధికారులు జారీ చేశారు. ఆ ప్రక్రియ సీబీఐ ద్వారా ఇంటర్‌పోల్‌కు చేరి ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్‌లను తీసుకొచ్చే ప్రక్రియ సాగుతున్నట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి. ప్రణీత్‌రావు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 4500 ఫోన్లను రహస్యంగా




ట్యాపింగ్ చేసినట్టు స్పెషల్ టీం అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేగాక, ప్రధానంగా ప్రస్తుత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబీకులతో పాటు పలువురు కాంగ్రెస్ కీలక నేతల ఫోన్లను ట్యాపింగ్ జరిపి, వారి కదలికలు, రాజకీయ ఎత్తుగడలను ఎప్పటికప్పుడు ఎస్‌ఐబీ చీఫ్‌కు సమాచారమందించినట్టు కూడా దర్యాప్తులో వెలుగు చూసింది. 198 మందికి పైగా కాంగ్రెస్ నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేశారనీ, ఆయన ట్యాపింగ్ చేసిన ఫోన్లన్నీ ఎయిర్టెల్ నెట్వర్క్‌కు చెందినవని స్పెషల్ టీం అధికారులు తెల్చారు. తాము జరిపిన ఫోన్ ట్యాపింగ్‌ల గుట్టు రట్టవటంతో ఎన్నికల ఫలితాలు వచ్చే ఒక రోజు ముందు ఎస్‌ఐబీ ఆఫీసులో తాము ట్యాపింగ్ కోసం ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక గదిలోని సాంకేతిక పరికరాలు, హార్డ్ డిస్క్‌లను ప్రణీత్‌రావు ధ్వంసం చేశాడని బయటపడింది. దాదాపు 328 జి.బి మేర తాము సేకరించిన సమాచా రాన్ని ధ్వంసం చేసినట్టు తేలింది. అయితే, ప్రస్తుత దర్యాప్తు లో అత్యంత కీలకమైన ఆ సమాచారాన్ని తిరిగి సేకరించటానికి స్పెషల్ టీం అధికారులు ప్రత్యేకంగా దృష్టిని సారించినట్టు తెలిసింది. ఈ విషయమై కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్న జూబ్లిహిల్స్ ఏసీపీ వెంకటగిరి తన సీనియర్ పోలీసు అధికారులతో చర్చించినట్టు సమాచారం. అలాగే, ఈ కేసులో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు అంశాలను నగర పోలీసు కమిషనర్ సి.వి ఆనంద్‌కు సైతం దర్యాప్తు అధికారులు విశదీకరించినట్టు తెలిసింది.

# ఉల్లి ధరలకు చెక్.. బఫర్ స్టాక్ విడుదలకు కేంద్రం నిర్ణయం

దిల్లీ: దేశంలో ఉల్లి ధరలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇది వరకే సేకరించి ముందస్తుగా నిల్వ చేసిన (బఫర్ స్టాక్ - ) స్టాక్‌ను హెూల్‌సేల్ మార్కెట్లోకి విడుదల చేయాలని నిర్ణయించింది.
ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు తొలగించిన నేపథ్యంలో దేశీయంగా ఉల్లి రిటైల్ ధరలు పెరుగుతుండడంతో కేంద్రం చర్యలు చేపట్టింది. దిల్లీతో పాటు మరికొన్ని ప్రధాన నగరాల్లోని హెూల్‌సేల్ మార్కెట్లోకి బఫర్ స్టాక్‌ను విడుదల చేయాలని నిర్ణయించినట్లు వినియోగదారు వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి నిధి ఖరే సోమవారం పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రాయితీ ఉల్లిని రిటైల్‌గా విక్రయించే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు.
"ఇటీవల ఎగుమతుల సుంకం ఎత్తివేసిన నేపథ్యంలో ఉల్లి ధరలు పెరుగుతాయని అంచనా వేస్తున్నాం. దీంతో 4.7 లక్షల టన్నుల బఫర్ స్టాక్ విడుదలకు నిర్ణయించాం. దీంతో పాటు ఖరీఫ్‌లో పెరిగిన ఉల్లి విస్తీర్ణంతో ఉల్లి ధరలకు కళ్లెం పడుతుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఉల్లి ఎగుమతులపై ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తూ కేంద్రం పది రోజుల క్రితం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. టన్నుకు 550 డాలర్లుగా ఉన్న కనీస ఎగుమతి ధరను తొలగించింది. దేశీయంగా ఉల్లి రైతులకు మెరుగైన ధర దక్కాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు ముడి పామాయిల్, రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతులపై సుంకాన్ని పెంచింది. ఈ క్రమంలోనే దేశీయంగా ఉల్లి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి.



దేశ రాజధాని దిల్లీలో కిలో రూ.55 పలుకుతోంది. ముంబయిలో రూ.58, చెన్నైలో రూ.60 చొప్పున విక్రయిస్తున్నారు. ఇతర ప్రధాన నగరాల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో ఉల్లిపై ఆంక్షల ఎత్తివేసినప్పటి నుంచి ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ ద్వారా దిల్లీ సహా ఇతర రాష్ట్ర రాజధానుల్లో రూ.35కే కిలో చొప్పున మొబైల్ వ్యాన్ల ద్వారా కేజీ ఉల్లిని కేంద్రం విక్రయిస్తోంది. జాతీయ సగటు కంటే ఉల్లి ధర ఎక్కువగా ఉన్న నగరాల్లో రాయితీ ఉల్లి విక్రయాలు చేపట్టనున్నట్లు చెప్పారు. దేశీయంగా రైతులకు రక్షణ కల్పించే ఉద్దేశంతోనే వంట నూనెలపై దిగుమతుల సుంకం పెంచినట్లు తెలిపారు. టమాటా ధరలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, అవసరమైతే జోక్యం చేసుకుంటామని పేర్కొన్నారు.

# జీడిమెట్ల పోలీసులను సస్పెండ్ చేయాలి

- మానవ హక్కుల వేదిక డిమాండ్

హైదరాబాద్: అకారణంగా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, థర్డ్ డిగ్రీ ప్రయోగించి, హింసకు పాల్పడిన జీడిమెట్ల పోలీసులను సస్పెండ్ చేయాలని మానవహక్కుల వేదిక నిజనిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది. రూ.5వేలు దొంగతనం చేశారనే ఆరోపణపై ఈనెల 16వ తేదీ షాపూర్ నివాసి రామునాయక్ (38)ను జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకొని, హింసించినట్టు తమ కమిటీ గుర్తించిందని మానవ హక్కుల వేదిక హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సంజీవ్, నగర కార్యదర్శి రోహిత్ తెలిపారు.
స్నేహితుల మధ్య జరిగిన దొంగతనం ఆరోపణల్లో పోలీసులు శృతిమించి వ్యవహరించి, రాము నాయక్‌ను చిత్రహింసలకు గురిచేశారనీ, వారి దెబ్బలకు అతని కుడికాలు, ఎడమ చెయ్యి పనిచేయకుండా పోయాయని తెలిపారు. ప్రస్తుతం రామునాయక్ ఎలాంటి పనులకు వెళ్లలేని దీనస్థితిలో ఉన్నాడనీ, ప్రభుత్వం అతనికి వైద్యసహాయం అందించాలని కోరారు. సంబంధం లేని విషయంలో పోలీసులు తనను ఇరికించే ప్రయత్నం చేశారని బాధితుడు చెప్పాడని వారు తెలిపారు. గతంలో ఇదే పోలీస్‌స్టేషన్‌లో



పోలీసులు అశోక్ అనే వ్యక్తిని కొట్టడం వల్ల అతను ఆత్మహత్య చేసుకొని చనిపోయాడన్నారు. ప్రభుత్వం ఈ రెండు ఘటనలపై విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. దీనికి బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేసి, చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో అమాయకులపై జరుగుతున్న హింసపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కి నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

# అప్పుల ఊబిలో సిరిసిల్ల సెస్

- మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయిలు రూ.237 కోట్లు
- 14ఏండ్లుగా చెల్లించని ప్రభుత్వాలు
- సెస్‌కు రావాల్సింది రూ.127 కోట్లు
- రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు రూ.110 కోట్లు
- 40 వేల మరమగ్గాల్లో 30 వేలు సిరిసిల్లలోనే..



సిరిసిల్ల: రాష్ట్రంలో మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. 14 ఏండ్లుగా ప్రభుత్వం చెల్లించని సబ్సిడీ మొత్తం రూ. 237 కోట్లకు చేరింది. ఈ భారీ మొత్తంలో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘానికి (సెస్) రావాల్సింది రూ. 127 కోట్లు కాగా, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు చెందినది రూ. 110 కోట్లు ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మరమగ్గాలకు 50 శాతం విద్యుత్ సబ్సిడీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అయితే ఆ సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించకపోగా నేటికీ బకాయిలు కుదిబండలా మారాయి. దాంతో ట్రాన్స్‌కోతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని సహకార విద్యుత్ సరఫరా సంఘానికి భారీ మొత్తంలో నష్టం వాటిల్లింది. గ్రామీణ విద్యుద్దీకరణలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సిరిసిల్ల సెస్ 1970 నవంబర్ 1న ప్రారంభమైంది. అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావు చేతుల మీదుగా ఈ సంస్థ ఆవిర్భవించింది. ప్రారంభంలో 46 గ్రామాల్లోని 4,720 మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసిన సెస్, నేడు 2.72 లక్షల మందికి సేవలందిస్తోంది. ప్రస్తుతం సెస్ పరిధిలో సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, మానకొండూరు నియోజకవర్గాలున్నాయి. 13 మండలాల్లోని 255 గ్రామ పంచాయతీల్లో సేవలందిస్తోంది. కాగా, 2004 నుంచి 2009 వరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే 50 శాతం మరమగ్గాలకు విద్యుత్ సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేశారు. ఆ తర్వాత 2010లో రోశయ్య, అనంతరం కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో విద్యుత్ సబ్సిడీ నిధులు రాలేదు. 2014నుంచి 2023 వరకు తెలంగాణ రాష్ట్ర సమితి పరిపాలన సాగించినా, అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కూడా ఈ బకాయిలను చెల్లించలేకపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 10నెలలు గడిచినా ఈ విషయంలో చొరవ చూపలేదు.

రాష్ట్రవ్యాప్తంగా 40వేల మరమగ్గాలు ఉండగా, ఒక్క సిరిసిల్ల జిల్లాలోనే 30వేల మరమగ్గాలు ఉన్నాయి. సిరిసిల్ల ప్రాంతంలో ట్రాన్స్‌కో కాకుండా సెస్ ఉండటంతో సంబంధిత సెస్‌కు రూ.97 కోట్లు మరమగ్గాల విద్యుత్ సబ్సిడీ బకాయిలు రావాల్సి ఉండగా, రూ. 30 కోట్ల వరకు ఆ విద్యుత్ బకాయిలపై సర్‌చార్జీలు కూడా చేరాయి. సెస్ ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ కొనుగోలు చేసి ట్రాన్స్‌కోకు డబ్బులు చెల్లిస్తున్నది. అంతేకాకుండా విద్యుత్ బిల్లులు బకాయి పడితే సర్‌చార్జీలు కూడా చెల్లిస్తోంది. కానీ ప్రభుత్వాలు మాత్రం సెస్‌కు మరమగ్గాల 50శాతం విద్యుత్ సబ్సిడీ బకాయిలు చెల్లించడంలో వెనకడుగు వేస్తున్నాయి. దాంతో జిల్లాకు సంబంధించిన వినియోగ దారుల డబ్బులతో నడుస్తున్న సెస్ అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతోనే సెస్ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విద్యుత్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా బకాయిలో ఉన్న మరమగ్గాల 50శాతం విద్యుత్ సబ్సిడీ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజలకు భారం కానున్న కరెంట్

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక ఉచిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఫ్రీ బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే సిలిండర్ అమలు చేస్తోంది. రుణ మాఫీ చేసింది. దసరాకు రైతుభరోసా ఇచ్చే ఆలోచనలో ఉంది. అయితే తొలిసారి ప్రజలకు షాక్ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. విద్యుత్ చార్జీలు పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో విద్యుత్ చార్జీలు పెరుగుతాయా అంటే అవుననే అంటున్నాయి విద్యుత్ పంపిణీ సంస్థలు. తమకు ఇప్పటికే భారీగా లోటు ఉందని, ఈ నేపథ్యంలో చార్జీలు పెంచక తప్పదని పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో 1,200 కోట్లు పూడ్చుకోవడానికి చార్జీలు పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాయి. గృహ విద్యుత్ 300 యూనిట్లు దాటితే స్థిర చార్జీ కిలోవాట్‌కు రూ.40 పెంచాలని కోరాయి. 2024?25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికను విద్యుత్ నియంత్రణ మండలికి సమర్పించాయి. మొత్త మూడు కేటగిరీల్లో విద్యుత్ చార్జీలను సవరించాలని ప్రతిపాదించాయి. తెలంగాణలో ఉత్తర, దక్షిణ డిస్కంలు ఈ ఏడాది తమ ఆదాయ, వ్యవయాల మధ్య ఉన్నలోటును వెల్లడించాయి. రెండు డిస్కంలకు కలిసి రూ.14,222 కోట్ల లోటు ఉందనిఅంచనా వేశాయి.ఈ మొత్తం లోటులో రూ.13,022 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో సమకూర్చాలని కోరాయి. అవి పోగా మిగిలిన రూ.1,200 కోట్లుచార్జీల పెంపుద్వారా పూడ్చుకోవాలని ప్రతిపాదించాయి. అయితే భారం పేద, మధ్య తరగి గృహ వినియోగదారులపై పడే అవకాశం లేనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గృహ విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటితే.. కిలోవాట్‌కు స్థిర చార్జీ రూ.10 వసూలు చేస్తున్నారు. అయితే ఆ మొత్తాన్ని మరో రూ.40 పెంచి రూ.50 వసూలుకు అనుమతి ఇవ్వాలని డిస్కంలు ప్రతిపాదించాయి.ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం 200 యూనిట్ల విద్యుత్‌ను అర్హులకు ఉచితంగా ఇస్తోంది. ఇక 299 యూనిట్ల విద్యుత్ వాడే మధ్య తరగతి వారికి కూడా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా 300 యూనిట్లు దాటినవారిపైనే భారం వేయాలని డిస్కంలు ప్రతిపాదించాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.30 కోట్ల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 300 యూనిట్లకుపైగా విద్యుత్ వినియోగించే గృహ వినియోగదారులు కేవలం 20 శాతమే. వారిపై మాత్రమే భారం పడే అవకాశం ఉందని తెలుస్తోంది.మిగతా 80 శాతం వినియోగదారులపై ఎలాంటి భారం ఉండదని డిస్కంలు చెబుతున్నాయి.డిస్కంల ప్రతిపాదనపై రాష్ట్రంలో కనీసం మూడుచోట్ల బహిరంగ చర్చ చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భం గా అభిప్రాయ సేకరణ చేసిన తర్వాతనే చార్జీలపెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.చార్జీల సవరణ అమలులోకి వస్తుంది.ఈ మొత్త ప్రక్రియ పూర్తి చేయడానికికనీసంమూడునెలలు పట్టేఅవకాశం ఉంది.

# సింగరేణిలో స్థానికత లొల్లి

- క్యాంపు ఆఫీస్ ఎదుట నిరుద్యోగుల ధర్నా
- 1100 మంది కార్మికుల్లో 200 మంది కూడా స్థానికులు లేరని ఆందోళన
- ఆర్జీ1 ఏరియా 5 ఇంక్లైన్‌లో 5 రోజులుగా నిలిచిన బొగ్గు ఉత్పత్తి



కోల్‌సిటీ: సింగరేణిలోని ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓబీ (మట్టి తొలగింపు), ఇతర పనులు నిర్వహిస్తున్న ప్రయివేటు కంపెనీల్లో స్థానికులకు 80శాతం ఉద్యోగాలు కేటాయించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయడం లేదని నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. పెద్దపల్లి జిల్లా ఆర్జీ1 ఏరియాలోని గోదావరిఖని 5 ఇంక్లైన్ ఓపెన్ కాస్టు మైన్‌లో ఓబీ పనులు నిర్వహిస్తున్న గుజరాత్‌కు చెందిన పీసీ పటేల్ కంపెనీ ప్రాజెక్టు క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం నిరుద్యోగులు ధర్నా చేశారు. ఓసీ-5 ప్రభావిత గ్రామాలైన సుందిల్ల, ముస్త్యాల, సింగిరెడ్డిపల్లి, గౌరెడ్డిపల్లి, గోదావరిఖని ఇతర గ్రామాల నిరుద్యోగులు, యువతకు పీసీ పటేల్ కంపెనీలో 80శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితులను పర్యవేక్షించారు. ఈ కంపెనీలో 1100 మందికి పైగా కార్మికులు పనిచేస్తుండగా 900వరకు స్థానికులకు అవకాశం దక్కాల్సి ఉండగా, కేవలం 200మంది మాత్రమే ఉన్నారన్నారు. కానీ పీసీ పటేల్ కంపెనీ మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్ నుంచి కూలీలను తెప్పించి పని చేపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నుంచి వస్తున్న కాలుష్యాన్ని ప్రభావిత గ్రామాల ప్రజలు అనుభవిస్తుండగా దాని లాభాలు స్థానికేతరులకు దక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యం స్పందించి స్థానికేతర ఉద్యోగులను ఇక్కడి నుంచి తిరిగి పంపేయాలని కోరారు. ఆందోళనకారులు స్థానికేతర కూలీలతో మాట్లాడి ఇక్కడి పరిస్థితిని వివరించి వారి స్వస్థలాలకు వెళ్లాలని కోరారు. 5 రోజులుగా ఈ ఆందోళన కొనసాగుతుండటంతో ఓసీ 5వ గని నుంచి బొగ్గు ఉత్పత్తి నిలిచి పోయింది. రోజుకు 40 టన్నుల చొప్పున బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉన్నా అది నిలిచిపోవడంతో బొగ్గు నిల్వలు నిండుకుంటున్నాయి. మరో రోజు ఆందోళన ఇలాగే కొనసాగి ఉత్పత్తి నిలచిపోతే పలు విద్యుత్ కంపెనీలకు బొగ్గు సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఉంది.

# కాళ్ల బేరానికి వచ్చిన గులాబీ దళం

**ప్రజా అవసరాలకు వినియోగించాలని వినతి**

నల్గొండ: కోర్ట్ తీర్పును గౌరవిస్తాం. సుప్రీంకోర్టు లో అప్పీల్ చేస్తాం. అప్పటి వరకు బీఆర్ఎస్ ఆఫీసు కూల్చొద్దు. నల్గొండ లోని ఏ పార్టీ కార్యాలయానికి అనుమతులు లేవు. ఈ విషయంలో అన్ని పార్టీలు కలిసి రావాలి.. మంత్రి కోమటిరెడ్డి మాటలకు, అధికారులు మోసపోవద్దు. ప్రజా అవసరాల కోసం బీఆర్ఎస్ ఆఫీసు ను ఉపయోగించండి.." అని నల్గొండ బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.ఎలాంటి అనుమతులు లేకుండా నల్గొండ జిల్లా కేంద్రం లో నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చాలని 15 రోజుల గడువు ఇస్తూ హై కోర్టు బుధవారం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.నిబంధనల మేరకు నాటి మంత్రివర్గ ఆమోదంతో.. ఆగ్రో సంస్థకు చెందిన, ఎకరం భూమిని ప్రభుత్వ నిబంధనల మేరకు డబ్బులు చెల్లించి, తీసుకొని పార్టీ కార్యాలయాన్ని నిర్మించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కార్యాలయంలో గత మూడు సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే జిల్లాకు చెందినమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి..బీఆర్ఎస్ పై కక్షపూని అనేక సమావేశాలలో, పార్టీ కార్యాలయాన్ని కూలగొట్టాలని.. అధికారులను ఆదేశించారన్నదే వీరి అభియోగం. నాటి మున్సిపల్ కమిషనర్ కు నిర్మాణ అనుమతి కోరుతూ దాఖలు చేసినా ఏ పార్టీ కార్యాలయానికి అనుమతులు లేవంటూ తాత్సారం చేశారని గుర్తు చేస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి తమకు నోటీసులు ఇచ్చినప్పుడు.. తాము ఫైన్ తో డబ్బులు చెల్లిస్తామని నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరినా .. మంత్రి ఆదేశంతో తిరస్కరించారన్నారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి వివరించారు.గత్యంతరం లేకనే బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించంగా, . కోర్టు తీర్పు బీఆర్ఎస్ కు ప్రతికూలంగా వచ్చింది. ‘ కోర్టు తీర్పును ఆసరా చేసుకున్న కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు.. జడ్జిమెంట్ కాపీ రాకముందే.. జెసిబి లు బుల్డోజర్లతో.. కార్యాలయాన్ని కులగొట్టాలని చూస్తున్నారు..’ అని జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. జడ్జిమెంట్ కాపీ అందిన వెంటనే కోర్టులో అప్పీల్ చేస్తామని, అప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చవద్దని పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

**ఏ పార్టీ ఆఫీసుకు అనుమతుల్లేవా.?**

జిల్లాలో ఏ పార్టీ కార్యాలయానికి అనుమతులు లేవని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అన్ని పార్టీల కార్యాలయాలకు కూడా ఇలాంటి నిబంధనలు వర్తింప చేస్తారా అన్న ప్రశ్నలు కూడా ఆ వర్గాల నుంచి వస్తున్నాయి. దశాబ్దాల కిందటే జిల్లా కేంద్రం లో సీపీఐ, సీపీఎం, టీడీపీ, బీజేపీ లకు విలువైన ప్రాంతాల్లో ఆఫీసులు ఉన్నాయి. కాంగ్రెస్ కార్యాలయం కూడా నిర్మాణంలో ఉంది. బీఆర్ఎస్ ఆఫీసు వ్యవహారం తో ఇపుడు అన్ని ఆఫీసుల విషయం చర్చకు వస్తోంది.

# హైడ్రా ఇక కూల్చుడే...

**ఇప్పటికే పూర్తయిన మార్కింగ్**

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రాకు చట్టబద్ధతపై అనేక సందేహాలు ఉన్నాయి. కోర్టుల్లో పిటిషన్ల కూడా దాఖలయ్యాయి. దీంతో హైడ్రా దూకుడు తగ్గింది. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం సందర్భం వచ్చినప్పుడల్లా హైడ్రా ఏం చేయబోతుందో చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలో హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చేందుకు కేబినెట్లో నిర్ణయం తీసుకున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదించడం ద్వారా పూర్తి స్థాయి చట్టబద్ధ సంస్థగా మారనుంది. హైదరాబాద్‌లో చెరువులు, కాల్వలు, కుంటల ఆక్రమణలను తొలగించటని హైడ్రా ప్రదాన ఉద్దేశం. ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ఆయా శాఖలకు అప్పగించటంతో పాటు మళ్ళీ ఆక్రమణలు జరగకుండా జలవనరులను కాపాడేందుకు ముఖ్యమంత్రి రేంత్ రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశారు. గతంలో ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేయటం ద్వారా హైడ్రాను ఏర్పాటు చేశారు. అయితే హైడ్రా ఏర్పాటు చట్టబద్దంగా లేదు కాబట్టి.. నోటీసులు ఇవ్వడం. కూల్చి వేయడానికి అధికారాలు ఉండవని వాదిస్తూ వస్తున్నారు. కోర్టుల్లో కూడా కేసులు పడటంతో తాత్కలికంగా హైడ్రా దూకుడు తగ్గింది. చట్టబద్ధత కల్పించే దిశగా.. జరిగిన క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేశారు. క్యాబినెట్ తీర్మానం అయినంత మాత్రాన హైడ్రాకు చట్టబద్ధత వచ్చినట్లు కాదని చెప్పుకోవచ్చు. చట్టం చేస్తేనే చట్టబద్ధత ఉన్నట్లు. చట్టబద్ధత ఇవ్వటానికి క్యాబినెట్ నిర్ణయం తీసుకోవాలి. ఇప్పుడు కేబినెట్ నిర్ణయం తీసుకుంది కాబట్టి తదుపరి అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టి పాస్ చేస్తుంది. ఆ తర్వాత గవర్నర్ గెజిట్ జారీ చేస్తే హైడ్రాక తిరుగు ఉందు. ఒకవేళ సమావేశాల నిర్వహణ ఆలస్యమైతే ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశం ఉంది. హైడ్రాకు ప్రభుత్వం చాలా కీలకమైన బాధ్యతలను ఇస్తోంది. మూసీ నది ప్రక్షాళన, చెరువులు, కాల్వలతో పాటు కుంటలను ఆక్రమించిన మరిన్ని నిర్మాణాలను తొలగించాల్సిన మిషన్ హైడ్రాకు ఇస్తోంది. హైడ్రాకు 169 మంది సిబ్బందిని ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే హైడ్రా చెరువులకు సంబంధించి పూర్తి సమాచరాంతో మార్కింగ్ చేసుంది. ప్రభుత్వ భూములు , ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలన్నింటినీ వరుసగా కూల్చిచేయనున్నారు. కూల్చి వేసిన వాటిని తొలగించడానికి ప్రత్యేకంగా టెండర్లు పిలుస్తున్నారు. ప్రత్యేక పోలీస్ స్టేషన్ కూడా ఉంటుంది. అంటే ఇక నోటీసులు.. కేసులు.. కూడా హైడ్రా నమోదు చేయగలదు. అందుకే.. వచ్చే కొద్ది రోజుల్లో హైడ్రా తన మార్క్ ను హైదరాబాద్ చుట్టూ చూపిస్తుందని భావిస్తున్నారు.

# వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి

- కలుషిత నీరు, ఆహారం అయ్యే ప్రమాదం
- దోమల పెరుగుదలను అరికట్టాలి
- చికిత్స కోసం అన్ని ఏర్పాట్లు : డీహెచ్ డాక్టర్ బి.రవీందర్ నాయక్



హైదరాబాద్: రాష్ట్రంలో ఎడతెరిపి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రోగాలు ప్రబలే ప్రమాదముందని వైద్యారోగ్యశాఖ హెచ్చరించింది. వ్యాధుల చికిత్సకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామనీ, ప్రజలు వ్యక్తిగతంగా వ్యాధులు వ్యాప్తి చెందకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాకాలంలో, వర్షాకాలం తర్వాత కొంత కాలం వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందనీ, వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గి, తేమ శాతం పెరడంతో వివిధ రకాల వైరల్ ఇన్‌ఫెక్షన్లు, దోమలతో పాటు ఆహారం, నీరు కలుషితం కారణంగా వచ్చే వ్యాధుల బారిన పడకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

"దోమలు వ్యాపించకుండా మస్కిటో నెట్స్, స్క్రీన్స్ వాడాలనీ, దోమలు ఎక్కువగా పెరిగే అవకాశమున్న ఉదయం, సాయంత్రం సమయాల్లో తలుపులు, కిటికీలు సరిగ్గా మూసుకోవాలి. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల బారిన పడతారు. 156 రంధ్రాలు కలిగిన మస్కిటో నెట్లను వాడాలి. పిల్లలు తేలికపాటి రంగుల దుస్తులను ధరించాలనీ, కాళ్లను, చేతులను కూడా కవర్ అయ్యేలా చూసుకోవాలి. బయటికి వెళ్లేటప్పుడు మస్కిటో రీపెల్లెంట్ వంటి క్రీములు, లోషన్స్, బాడీ స్ప్రేలను వాడాలి. రసాయన మస్కిటో రీపెల్లెంట్స్‌ను పిల్లలకు దూరంగా ఉంచాలి. నీటి నిల్వ లేకుండా జాగ్రత్త పడాలి. సెప్టిక్ ట్యాంక్‌లను పూర్తిగా కవర్ చేయాలి. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలి%ొ%" అని సూచించారు."బయటికి వెళ్లినప్పుడు ఇంటి నుంచి కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలి. తరచుగా చేతులను శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా బయటి ఆహారం, కోసినవి, సరిగ్గా కవర్ చేయాలని చాట్, సలాడ్స్, ఫ్రూట్స్, జ్యూసెస్‌కు దూరంగా ఉండాలి. ఇంట్లో వండిన తాజా ఆహారాన్ని మాత్రమే భుజించాలి. వ్యాధిబారిన పడిన వారితో చేతులు కలపడం, ఆహారాన్ని పంచుకోవడం, నీరు, వస్త్రాలు పంచుకోవద్దు. బహిరంగ ప్రదేశాలకు వెళ్లినప్పుడు తలుపుల హ్యాండిల్స్, టేబుల్ టాప్స్ వంటి వాటిని తాకకూడదు.

తగ్గినప్పుడు ఇతరులకు ఇన్ఫెక్షన్ సోకకుండా మూతిని పూర్తిగా కవర్ చేసుకోవాలి. దగ్గు, తుమ్ములు వచ్చినప్పుడు వాడిపాడేసే టిషఉ్యలను ఉపయోగించాలి. ఎవరైన జ్వరంతో కూడిన దగ్గు, తలనొప్పి, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, కండ్లకలక లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలి%ొ%" అని డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ప్రభుత్వం జ్వరపీడితుల కోసం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక బెడ్లను సిద్ధం చేసినట్టు డీహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. ఇప్పటికే ఆయా ఆస్పత్రుల్లో ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఆస్పత్రికి వ్యాధిగ్రస్తులు చేరుకునేలోపు అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు వీలుగా ఏఎన్ఎం, ఆశాలు, అంగన్ వాడీ వర్కర్ల వద్ద ఓఆర్ఎస్ సాచెట్లను ఉంచినట్టు పేర్కొన్నారు.

# వెంచర్ ముప్పు..?

- మండల కేంద్రంలో గాడి తప్పిన డ్రైనేజ్ వ్యవస్థ
- దోమలకు నిలయంగా మండల కేంద్రం
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు.



బెజ్జంకి: మండల కేంద్రంలోని ప్రజలు దోమల బెడదతో బెంబెలెత్తిపోతున్నారు.పగలు,సాయంత్రం, రాత్రంటూ సమయమేమి లేకుండా మండలంలోని ప్రజలు దోమ కాటుకు బలవుతూనే ఉన్నారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబర్చి పారిశుధ్య నిర్వహణ కోసం చెత్త సేకరణ,డ్రై డే ఫ్రైడే వంటి కార్యక్రమాలతో గొప్ప సంకల్పాన్ని అమలు చేస్తున్న వాటిని అధికారులు తుతూ మంత్రంగా వ్యవహరిస్తూ పట్టించుకోకుండా నీరుగార్చేల విధులు నిర్వర్తిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే దోమలు విస్తృతంగా వ్యాప్తి చెందుతూ ప్రజారోగ్యంపై ప్రభావం చూచూపుతున్నాయని ప్రత్యేకాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి మెరుగైన చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ..**

మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.కాల్వల్లో మురికి నీరు నిలవడం,పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా మారడం వల్ల దుర్వాసన వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారి ఇళ్లల్లోకి వస్తున్నాయని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.మండల కేంద్రంలో మురుగు నీరు కాల్వ వ్యవస్థ అధ్వానంగా మారి ప్రధాన రోడ్డుపై పారుతుండడంతో అవస్థలు పడుతున్నామని రోడ్డు ప్రక్కన ఇళ్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో వాహనదారులు,కాలినడకన వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు.మురికి నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యాలకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దోమలు కుట్టడం వల్ల మలేరియా,డెంగ్యూ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రభలుతున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.మండల,గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడం వల్లే పారిశుధ్యం పడకేసిందని ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత జిల్లా, మండలాధికారులు స్పందించి అస్తవ్యస్తంగా మారిన మురుగు నీరు కాలువల్లో దోమల మందు పిచికారీ చేయించాలని దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# పార్టీ బాట పట్టనున్న మంత్రులు

## పీసీసీ చీఫ్ నిర్ణయం వెనుక పెద్ద ప్లాన్..

హైదరాబాద్: ప్రజా ప్రభుత్వంగా చాటుకుంటున్న రేవంత్‌రెడ్డి సర్కార్? ఇప్పుడు పార్టీ బాట పట్టనుంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధంగా పార్టీ కార్యాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను తెలుసుకోవాలని నిర్ణయించిన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్?. ముఖ్యమంత్రి, మంత్రులంతా గాంధీభవన్‌కు రావాలని తాజాగా ప్రతిపాదించారు.ప్రభుత్వమంటే సచివాలయం, అసెంబ్లీ.. ముఖ్యమంత్రి, మంత్రులే కాదని ప్రభుత్వంలో పార్టీ కూడా ఓ భాగమని చెప్పాలనుకున్న పీసీసీ చీఫ్.. నెలకొకసారైనా సీఎం రేవంత్‌రెడ్డి గాంధీభవన్‌లో అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.. అదేవిధంగా మంత్రులు కూడా వారానికి రెండుసార్లు పార్టీ క్యాడర్ కష్టనష్టాలు తెలుసుకునే విధంగా గాంధీభవన్‌కు రావాలని సూచించారు. పీసీసీ చీఫ్ ప్రతిపాదనకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇకపై మంత్రులు వారం వారం గాంధీభవన్‌లో ప్రత్యక్షం కావడం తప్పనిసరిగా మారింది.వాస్తవానికి ప్రజా ప్రభుత్వంగా తొలి నుంచి చెబుతున్న రేవంత్‌రెడ్డి సర్కార్.. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ప్రజా భవన్‌లో ప్రజాదర్బార్‌కు శ్రీకారం చుట్టింది. తొలుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క వంటి వారు కొద్దిరోజులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమ బాధ్యతలను ఆ తర్వాత ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డికి అప్పగించారు.ఈ కార్యక్రమం ప్రభుత్వ పరంగా నిర్వహిస్తుండగా, మంత్రులను ఇన్‌వాల్వ్ చేస్తూ? వారిని గాంధీభవన్ రప్పించే ప్లాన్ చేశారు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్. కొద్ది రోజుల క్రితం వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నా? ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదు. కానీ, పార్టీలో తన మార్క్ చాటుకోవాలనే ప్రయత్నంతో మహేశ్‌కుమార్ గౌడ్ కొత్త స్కీమ్‌కు తెరతీశారా? అన్న చర్చ జరుగుతోంది.పార్టీ కార్యాలయంలో మంత్రులు అందుబాటులో ఉండాలని పీసీసీ చీఫ్ నిర్ణయించడంతో సీఎం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటున్నారు. ప్రజాభవన్‌లో మంగళ, శుక్రవారాలు జరుగుతుండగా..

గాంధీభవన్‌లో బుధ, శుక్రవారాల్లో మంత్రులు అందుబాటులో ఉండేలా నిర్ణయించినట్లు చెబుతున్నారు. దీంతో మంత్రులకు విడతల వారీగా గాంధీభవన్ డ్యూటీ వేస్తారని చెబుతున్నారు.పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక పెద్ద ప్లానే ఉందని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ పదేళ్లు అధికారంలో కొనసాగాలంటే కార్యకర్తలను ప్రోత్సహించాల్సి వుందన్న ఆలోచనే ఈ కార్యక్రమానికి ప్రేరణగా చెబుతున్నారు. ఇదే సమయంలో పక్క రాష్ట్రంలో ప్రతి రోజూ ప్రజల నుంచి మంత్రులు ఫిర్యాదులు స్వీకరిస్తుండటం కూడా కాంగ్రెస్ అధ్యక్షుడిని ఆకర్షించిందని అంటున్నారు.మరోవైపు రాష్ట్రంలో ఎంఐఎం వంటి చిన్న పార్టీలు సైతం తమ ఎమ్మెల్యేలను పార్టీ కార్యాలయంలో కూర్చోబెట్టి ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారని? అందువల్లే ఎంఐఎం పార్టీ పాతబస్తీలో పాతుకుపోయిందని ప్రచారం ఉంది. ఇవన్నీ గమనించే రాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రులు కూడా పార్టీ కార్యాలయానికి రావాల్సిందిగా పీసీసీ చీఫ్ ప్రతిపాదించారంటున్నారు. ఇక సీఎం కూడా ఓకే చెప్పడంతో వచ్చే వారమే ఈ కార్యక్రమం మొదలయ్యే అవకాశం ఉందంటున్నారు.

ఇతర రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఈ విధానాన్ని అనుసరిస్తున్నా? కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీ ఈ కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. అసలే కాంగ్రెస్‌లో నేతల తాకిడి ఎక్కువ? వారి కోరికలకు అడ్డూ అదుపు ఉండే పరిస్థితి లేదంటున్నారు. ఈ పరిస్థితుల్లో మంత్రులను పార్టీ కార్యాలయానికి రప్పించడం ద్వారా కాంగ్రెస్‌ను ప్రాంతీయ పార్టీలకు దీటుగా తయారు చేయాలనే ప్లాన్ కనిపిస్తున్నా? సీనియర్ నేతల తాకిడి ఎక్కువగా ఉంటే కాంగ్రెస్ పార్టీకి ఈ కార్యక్రమం సవాల్‌గానే చెబుతున్నారు. మరి ఈ సవాల్‌ను ఆ పార్టీ యంత్రాంగం ఎలా అధిగమిస్తుందనేది చూడాల్సివుంటుంది. మొత్తానికి నయా పీసీసీ చీఫ్ స్ట్రాటజీ ఏ మేరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

# అంగన్వాడీల కలెక్టరేట్ ఎదుట ధర్నా

భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా అప్ గ్రేడ్ అయిన అంగన్వాడీ టీచర్లకు నెల నెల చెల్లించాల్సిన పెరిగిన వేతనాలను నెల నెలా కాకుండా ఒక నెల టీచర్ శాలరి, ఒక నెల హెల్పర్ శాలరి చెల్లించడాన్ని నిరసిస్తూ తెలంగాణా అంగన్వాడీ టీచర్స్ ఒ హెల్పర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఐడివోసి కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నాకు దిగారు. తమ డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... అప్ గ్రేడ్ అయిన అంగన్వాడీ టీచర్ల జీతాలు పెంచి ఎందుకు చెల్లించరని, సాకులు ఎందుకు చెప్తున్నారని ప్రశ్నించారు. ఒక నెల పెంచిన జీతం ఇస్తూ మరొక నెల పాత జీతం చెల్లించడం అన్యాయమని అని అన్నారు. సమస్య పరిస్కారం కొరకు అన్ని స్థాయిల అధికారులను కలిసిన సమస్య పరిష్కారం కాకపోవడంతో ధర్నాకు దిగామని అని అన్నారు. అప్ గ్రేడ్ అయిన అంగన్వాడీ టీచర్లకు తక్షణమే హెల్పర్లను కేటాయించాలని, పని భారం తగ్గించాలని, బిఎల్ఓ ల పేరిట వేధింపులు ఆపాలని అన్నారు. జీతాలు చెల్లించే విషయంలో వస్తున్న సాంకేతిక సమస్యలని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ఆరోగ్యశ్రీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మె,

## కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు

భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట రాజీవ్ ఆరోగ్యశ్రీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన దీక్షలు చేపట్టారు. డిమాండ్ల పరిష్కారం కొరకు నిరవధిక సమ్మెకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... అవుట్సోర్సింగ్ విధానం రద్దు చేసి తమను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లుగా గుర్తించి జీవో నెంబర్ 60 ప్రకారం తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి తమకు హెల్త్ కార్డులు అందించాలని, భీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. ట్రస్ట్ ట్రెజరీ ద్వారా తమకు జీతాలు చెల్లించాలని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని అని అన్నారు.

# 4 నెలల ముందు నుంచే ఎన్నికల కోలాహలం

కరీంనగర్: ఉత్తర తెలంగాణాలోని కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం వచ్చే ఫిబ్రవరిలో ఖాళీ అవుతుంది. సిట్టింగ్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవన్ రెడ్డి ఉన్నారు. బీఆర్ఎస్ హవా కొనసాగిన సమయంలోనే కాంగ్రెస్ కు చెందిన జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందడంతో ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసేందుకు బోలెడు మంది ఆసక్తి చూపుతున్నారు.నాలుగు ఉమ్మడి జిల్లాలతో ముడిపడి ఉన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచే వారి సంఖ్య ఈసారి సెంచరీ దాటనుంది. పోటీకి ఆసక్తి చూపుతున్న వారు ఓటర్ నమోదు ప్రక్రియలో ప్రచారాన్ని చేపట్టారు. ఎలక్షన్ కమిషన్ అక్టోబర్ 1 నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభిస్తుండగా ఆశావాహులు ఇప్పటికే ఎన్రోల్మెంట్ ప్రక్రియను చేపట్టి మద్దతు కూడగట్టుకుంటున్నారు.అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులూగా బరిలోకి దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. పార్టీ తమకు వేదిక అవుతుందని, టికెట్ రాకపోయినా బరిలో ఉండేందుకు సిద్ధమవుతున్నారు. మున్ముందు ఈ పోటీ అన్ని పార్టీల్లో పెరిగి స్వతంత్రుల సంఖ్య పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. కాంగ్రెస్ కష్టకాలంలో జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ప్రస్తుతం ఆయన పోటీకి ఆసక్తి చూపడం లేదు. దీంతో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు ఎక్కువ మంది పోటీ పడుతున్నారు.ప్రస్తుతం కరీంనగర్ కు చెందిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, ఇటీవల ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన వెలిచాల రాజేందర్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. నరేందర్ రెడ్డి ఇప్పటికే ఉమ్మడి నాలుగు జిల్లాల్లో పర్యటిస్తూ విద్యాసంస్థల ఉద్యోగులతో సమావేశమై ఓటు నమోదు ప్రక్రియ ముమ్మరం చేశారు. టికెట్ రాకపోయినా ఇండిపెండెంట్ గా పోటీ ఉంటానని స్పష్టం చేశారు.ఉత్తర తెలంగాణలో తన విద్యాసంస్థలు, తనకున్న పరిచయాలతో గ్రాడ్యుయేట్ల వివరాలు ఎన్రోల్మెంట్ కోసం సేకరిస్తున్నారు. వెలిచాల రాజేందర్ రావు ఎంపీ ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తు సిరిసిల్ల చేనేతకు ప్రభుత్వ బ్రాండింగ్, ట్రేడింగ్లో శిక్షణ, గ్రాడ్యుయేట్లకు మేనిఫెస్టోతో ముందుకెళ్తున్నారు. ఎమ్మెల్సీగా పార్టీ అవకాశమిస్తే పోటీ చేస్తానని తెలిపారు. పార్టీ నిర్ణయమే తనకు శిరోధార్యమని, ఎవరికి టికెట్ ఇచ్చినా బలపరుస్తానని స్పష్టం చేస్తున్నారు.రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ నుంచి మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, డాక్టర్ బీఎన్ రావు, ట్రస్మా ప్రతినిధి యాదగిరి శేఖర్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ సైతం టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల కేసీఆర్ ను రవీందర్ సింగ్ కలిసి అభయం కూడా తీసుకున్నారు.అయితే ఎవరికి వారే గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నారు. గత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేసిన రవీందర్ సింగ్ మేయర్ గా సివిల్ సప్లై కార్పోరేషన్ చైర్మన్ గా అందించిన సేవలు, ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లకు చేసిన సేవల ఆధారంగా మద్దతు కూడగట్టుకుంటున్నారు.ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పోటీకి ఆసక్తి చూపే వారి సంఖ్య కూడా బాగానే ఉంది. కరీంనగర్, ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ ఎంపీలుగా బీజేపీకి చెందిన వారే ఉండడంతో ఎమ్మెల్సీ గా గెలుస్తామనే ధీమాతో ఆ పార్టీ నుంచి టికెట్ రేస్ లో ప్రముఖుల పేర్లు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ, బీజేపీ కిసాన్ సెల్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుగుణాకర్ రావు, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ బోగ శ్రావణ తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. పార్టీలో సీనియర్ నేత అయిన తనకు ఇటీవల అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో అవకాశం దక్కలేదని ఈసారి ఎలాగైనా తనకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాల్సిందేనని సుగుణాకర్ రావు పట్టుబడుతున్నారు. రాణీ రుద్రమసిరిసిల్ల నుంచి అవకాశం కల్పించిన నేపథ్యంలో ఈసారి తమకు ఇవ్వాల్సిందేని సుగుణాకర్రావు వర్గం వాదిస్తోంది. మరోవైపు రాణీరుద్రమ మాత్రం కేంద్రమంత్రి బండి సంజయ్ ని నమ్ముకుని టికెట్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో ఎంపీ తరఫున ఒకరు టికెట్ కోసం గట్టి ప్రయత్నాలే చేస్తుండడంతో అభ్యర్థి ఎంపిక ఆ పార్టీకి తలనొప్పిగానే మారనుంది.మూడు ప్రధాన పార్టీల నుంచే కాకుండా పార్టీ టికెట్ దక్కకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. అయితే ఎమ్మెల్సీ అభ్యర్థి ఎవరిని ఎంపిక చేయాలి... అధిష్టానం ఎలాంటి వ్యూహాలతో ముందుకు సాగుతుందో ఎవరి అంతుచిక్కడం లేదు. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులంతా ఎవరి ధీమాలో వారు ఉన్నారు.ఎన్నికల్లో మరో నాలుగు నెలల తరువాత జరగనున్న నేపథ్యంలో ఇప్పుడే నిర్ణయం తీసుకోవడం అవసరమా? అన్న భావనతో పార్టీ ముఖ్యనేతలు ఉన్నట్లుగా తెలుస్తోంది. షెడ్యూల్ వెలువడిన తరువాత అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై దృష్టి సారించే యోచనలో ప్రధాన పార్టీలు ఉన్నట్లు సమాచారం.

# సాగర్ ఎడమకాలువకు నీళ్లు విడుదల చేయాలని ధర్నా

## అధికారుల నిర్లక్ష్యం.. ఎండుతున్న పంటలు

ఖమ్మం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని పంటలు ఎండి పోతున్నాయని, వెంటనే సాగునీళ్లు విడుదల చేయాలని సిపిఎం,తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ఎన్ఎస్పీ డివిజన్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా చేశారు. సిపిఎం పార్టీ కార్యాలయం నుంచి ఎన్ఎస్పి కార్యాలయం వరకు ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 20 రోజుల క్రితం సాగర్ కాలువకు గండి పడితే అధికారులు నిర్లక్ష్యంతో ఇంకా గండి పూడ్చలేదన్నారు.దీంతో పాలేరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఉన్న లక్షల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఎండిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఈ నరేష్ స్పందించారు. నేటి నుంచి నీళ్లు విడుదల చేస్తామని పాలేరు డివిజన్ ఇంజినీర్ మన్మధరావు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.ఈ కార్యక్రమంలో గుడవర్తి నాగేశ్వరరావు, రాంరెడ్డి, ఏటుకూరి రామారావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కలకలం రేపుతున్న వాకీటాకీల పేలుళ్లు

## కేరళ, లెబనాన్ లో మూలాలు

న్యూఢిల్లీ: లెబనాన్‌లో ఏకకాలంలో పేజర్లు పేలి 12 మంది మృతి చెందగా, వేల సంఖ్యలో తీవ్రగాయాలపాలైన ఘటన ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ పేలుళ్ల వెనుక ఇజ్రాయిల్ దేశ నిఘా సంస్థ 'మొస్సాద్' హస్తం ఉందని లెబనాన్ ఆరోపిస్తోంది. పేజర్లు పేలిన ఘటన నుంచి ఇంకా తేరుకోక ముందే వాకీటాకీలు సైతం ఏకకాలంలో పేలి ఆ దేశాన్ని మరింత దెబ్బతీశాయి. ముఖ్యంగా ఆ దేశం కేంద్రంగా పనిచేస్తున్న 'హెజ్బొల్లా' గ్రూప్ ఈ వరుస దాడులతో భంగుతిన్నది. ఇజ్రాయిల్ ? లెబనాన్ (హెజ్బొల్లా) మధ్య యుద్ధం జరుగుతున్న ఈ సమయంలో ఈ చర్యలో నీతి, న్యాయం, ధర్మం సంగతి పక్కనపెడితే.. ఈ తరహాలో శత్రువులను దెబ్బతీయడం ప్రపంచంలో మొదటిసారిగా చోటుచేసుకుంది ఇజ్రాయిల్ ప్రజలు తమ పండగ వేడుకల్లో మునిగి తేలుతున్న సమయంలో గాజా నుంచి 'హమాస్' ఉగ్రవాదులు విరుచుకుపడి సృష్టించిన మారణహోమం యావత్ ప్రపంచం చూసింది. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయిల్ చేపట్టిన కౌంటర్ ఆపరేషన్స్ అంతకు మించిన మారణహోమాన్ని సృష్టించాయి. గాజాలోని 'హమాస్' సంస్థకు భావసారూప్యత కల్గిన ఉగ్రవాద, వేర్పాటువాద సంస్థలతో సన్నిహిత సంబంధాలున్నాయి. హమాస్ తరహాలోనే లెబనాన్‌లో కూడా సాయుధ ఇస్లామిక్ గ్రూప్ 'హెజ్బొల్లా' పనిచేస్తోంది. ఈ సంస్థకు ఉన్న సైనిక సంపత్తి ఒక చిన్న దేశం సైన్యంతో సమానం. ఇప్పుడు ఈ సంస్థ కూడా ఇజ్రాయిల్‌పై ఆయుధాలు ఎక్కుపెట్టింది. వరుసగా మిస్సైళ్లతో దాడులకు తెగబడింది. ఇజ్రాయిల్ రక్షణ కవచం అనేక మిస్సైళ్లను మధ్యలో ఆకాశంలోనే ధ్వంసం చేసినప్పటికీ.. కొన్ని నేలను చేరి విధ్వంసం సృష్టించాయి. అందులో ఫుట్‌బాల్ మైదానంలో మిస్సైల్ సృష్టించిన విధ్వంసంలో యువత, పసిపిల్లలు కూడా చనిపోయారు. ఈ ఘటన ఇజ్రాయిల్‌ను మరింత ఆగ్రహోద్రిక్తం చేసింది. ఆ పర్యవసానమే లెబనాన్‌లో జరిగిన పేజర్, వాకీ-టాకీ పేలుళ్లు,లెబనాన్‌తో పొంచి ఉన్న ముప్పు నేపథ్యంలో ఇజ్రాయిల్ ఆ దేశ సాయుధ హెజ్బొల్లా గ్రూపు కార్యకలాపాలపై తమ నిఘా కొనసాగించింది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన నిఘా సంస్థల్లో ఒకటిగా పేరుగాంచిన ఇజ్రాయిల్ నిఘా విభాగం 'మొస్సాద్', హెజ్బొల్లా కార్యకలాపాలను పసిగడుతూ కౌంటర్ ఆపరేషన్లు చేపడుతూ వచ్చింది. పెగాసస్ వంటి అత్యంత శక్తివంతమైన నిఘా సాఫ్ట్‌వేర్ రూపకర్తలైన ఇజ్రాయిలీ దేశస్థులు సెల్‌ఫోన్లు, ఆధునిక కమ్యూనికేషన్ పరికరాలను ఉపయోగించడం తమ కదలికలను పసిగడుతున్నారని 'హెజ్బొల్లా' భావించింది. అందుకే కాలం చెల్లిన కమ్యూనికేషన్ వ్యవస్థ 'పేజర్' సేవలను మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చింది. సెల్‌ఫోన్ల రాకముందు పేజర్ల ద్వారా సమాచారం ఇచ్చిపుచ్చుకునేవారు. వాటిని ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా వినియోగించడం లేదు. కంట్రోల్ సెంటర్ నుంచి ఇచ్చే సందేశం పేజర్లకు చేరుతుంది. తద్వారా మొస్సాద్ కళ్లుగప్పి తమ కార్యకలాపాలను కొనసాగించవచ్చని హెజ్బొల్లా భావించింది. అయితే ఈ విషయం తెలుసుకున్న మొస్సాద్, వారికి సరఫరా చేసే పేజర్లను మధ్యలోనే తమ చేతుల్లోకి తీసుకుని, ప్రతి పేజర్‌లో అత్యాధునిక పేలుడు పదార్థాలు అమర్చింది. ప్రతి పేజర్‌లో బ్యాటరీకి ఆనుకుని అమర్చిన 3 గ్రాముల ఖజనే ఇంత విధ్వంసాన్ని సృష్టించింది. ఏకకాలంలో పేలిన పేజర్లు 'గోల్డ్ అపోలో' సంస్థకు చెందిన ఏఆర్-924 మోడల్ పేజర్లు. గోల్డ్ అపోలో సంస్థ తైవాన్ దేశానికి చెందినది. అయితే తమ ట్రేడ్‌మార్క్ లైసెన్సు ను ఉపయోగించుకునే అవకాశాన్ని హంగేరీ రాజధాని బుడాపెస్ట్ కేంద్రంగా పనిచేస్తున్న బీఏసీ కన్సల్టింగ్ కేఎఫ్‌టీ సంస్థకు ఇచ్చింది. ఆ సంస్థే ఏఆర్-924 మోడల్ పేజర్లను తయారు చేసింది. వాటిని బల్గేరియా రాజధాని సోఫియా కేంద్రంగా పనిచేస్తున్న 'నోర్టా గ్లోబల్' సంస్థ సరఫరా చేసిందని కథనాలు వచ్చాయి. 2022లో ఈ సంస్థ రిజిస్టర్ చేసుకుంది. దీనిపై బల్గేరియా దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. లెబనాన్‌లో పేలిన పేజర్ల తయారీ, ఎగుమతిలో తమ దేశానికి ఎలాంటి సంబంధం లేదని ఆ దేశం ప్రకటించింది. అయితే నోర్టా గ్లోబల్ సంస్థ పాత్రపై దర్యాప్తు చేస్తున్నామని తెలియజేసింది. ఈ మొత్తం వ్యవహారంలో కేరళ వ్యక్తి పాత్ర ఏముందని అన్న సందేహం తలెత్తవచ్చు. బల్గేరియా రాజధాని సోఫియాలో 'నోర్టా గ్లోబల్' పేరుతో సంస్థను ఏర్పాటు చేసిన వ్యక్తి కేరళలోని వాయనాడ్‌కు చెందిన రిన్సన్ జోస్. లెబనాన్‌కు సరఫరా చేసిన పేజర్లలో పేలుడు పదార్థాలతో పాటు బ్యాటరీని వెడెక్కించేలా మాల్‌వేర్, స్పైవేర్ అప్‌లోడ్ చేసినట్టు ఆరోపణలున్నాయి. ఆ క్రమంలోనే ఏకకాలంలో అన్ని పేజర్లను పేల్చడం సాధ్యపడిందన్న విశ్లేషణలు జరుగుతున్నాయి. అసలు ఇదంతా ఎలా జరిగిందన్నది దర్యాప్తు సంస్థలు తేల్చుతాయి. అయితే లెబనాన్‌కు చేరిన పేజర్లను సరఫరా చేసిన సంస్థ అధిపతి కేరళ వాసి అన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం నార్వే పౌరసత్వం తీసుకుని ఆ దేశంలోనే స్థిరపడ్డ రిన్సన్ జోస్ గురించి అటు నార్వే, ఇటు బల్గేరియా దర్యాప్తు సంస్థలు ఆరా తీస్తున్నాయి. నోర్టా గ్లోబల్ సంస్థ తమ కన్సల్టింగ్ కార్యకలాపాల ద్వారా యూరప్ బయట గత ఏడాది 725,000 డాలర్ల ఆదాయం సమకూర్చినట్టు పేర్కొంది.రిన్సన్ జోస్ ఉన్నత చదువుల కోసం కేరళను వీడి నార్వే వెళ్లినట్టు తెలిసింది. చదువు పూర్తయ్యాక కొంత కాలం యూకే రాజధాని లండన్‌లో ఉద్యోగం చేసిన జోస్, మళ్లీ తిరిగి నార్వే రాజధాని ఓస్లోకి వెళ్లిపోయాడు. నార్వే ప్రెస్ గ్రూప్ ఆజె మీడియాలో డిజిటల్ కస్టమర్ సపోర్ట్‌గా ఐదేళ్ల పాటు పనిచేశాడు. నార్వేలోనే పెళ్లి చేసుకుని అక్కడే స్థిరపడ్డాడు. జోస్ కవల సోదరుడు లండన్‌లో ఉంటున్నాడు. అయితే పేజర్ల పేలుడు ఘటన తర్వాత నుంచి జోస్ ఎవరికీ అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లినట్టు తెలిసింది. తన సోదరుడు ముక్కుసూటి మనిషి అని, తప్పులు చేయడని, బహుశా ఎవరైనా ట్రాప్ చేసి ఉంటారని కవల సోదరుడు అభిప్రాయపడ్డాడు.మొత్తంగా కేరళలో పుట్టి నార్వేలో సెటిలైనరిన్సన్ జోస్ ఇప్పుడు లెబనాన్‌కు మోస్ట్ వాంటెడ్‌గా మారాడు.

# యాప్ పేరిట ఘరానా మోసం

మిర్యాలగూడ: తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలన్న ఆశతో ఆర్థిక నేరగాళ్ల వలలో చిక్కి మోసపోతున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు ఇంట్లో కూర్చుని డబ్బు సంపాదించవచ్చు అన్న ప్రకటనతో కొత్త ఆశలకు రెక్కలు తొడుగుతున్నారు తీరా మోసపోయి తలలు పట్టుకుంటున్నారు మిర్యాలగూడలో ఓ ఆన్లైన్ యాప్ వలలో చిక్కి సుమారు 400 మంది దురదృష్టాన్ని కొనితెచ్చుకున్నారు మిర్యాలగూడలో ఐపీఎస్ యాప్ ద్వారా వేలు లక్షలు సంపాదించవచ్చని కొందరు కేటుగాళ్లు అమాయకులను బురిడీ కొట్టించారు రీల్స్ కి లైక్ చేస్తే చాలు డబ్బులు మీ వాలెట్లో జమ అవుతాయని ఆశ చూపించారు ముందుగా డిపాజిట్ చేసిన డబ్బును పట్టి టాస్కులు ఇచ్చి వారి వాలెట్లో డబ్బులు జమ అయినట్టు మెసేజ్ పంపిస్తారు పి వన్ కేటగిరిలో 2100 ఐపీఎస్ యాప్ లో డిపాజిట్ చేస్తే రోజుకు ఐదు రియల్స్ పంపి ఒక్కోరీల్ కి లైక్ కొట్టడం ద్వారా 15 చొప్పున 75 రూపాయలు వాలెట్లో జమ అయినట్టు చూపుతారు పి టు కేటగిరిలో 5500 డిపాజిట్ చేస్తే రోజుకి 10 రీల్స్ పంపి రీల్ కి 20 రూపాయల చొప్పున 200 వాలెట్లో జమ అయినట్టు చూపుతారు పి3 స్లేట్లో 18,300 డిపాజిట్ చేస్తే 15 టాస్కులు ఇచ్చి ఒక్కో దానికి 44 రూపాయల చొప్పున 660 రూపాయలు జమ అయినట్లు చూపుతారు ఇలా లక్షల వరకు డిపాజిట్ చేసుకునే అవకాశం కల్పించారు దీంతో ఆశావాహులు డిపాజిట్లు చేసి వారు పంపిన రీల్స్ కి లైక్లు కొడుతూ వస్తున్నారు తీరా 10 రోజులుగా యాప్ పనిచేయకపోవడం కార్యాలయానికి తాళం వేయడంతో డిపాజిటర్లు లబోదిబోమంటున్నారు

# మైనర్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

సిద్దిపేట: మైనర్ డ్రైవింగ్ చేసే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ హెచ్చరించారు. కారణం లేని మరణం ఒక రోడ్డు ప్రమాదం మాత్రమే. ఈ సంవత్సరం 2024 జనవరి నుండి మైనర్ డ్రైవింగ్ చేసే వారిపై 798 కేసులు నమోదు చేయడం జరిగిందని ఆమె అన్నారు. మైనర్ డ్రైవింగ్ వల్ల ఎంతోమంది పిల్లలు చనిపోవడం క్షతగాత్రులు కావడం జరుగుతుందన్నారు.

అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లలను ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. ఎంతమంది వచ్చి ఓదార్చినా వారి కుటుంబానికి జరిగిన నష్టాన్ని ఎవరూ పూరించలేరు. మైనర్ డ్రైవింగ్ వల్ల సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, పట్టణాలలో మరియు గ్రామాలలో కూడా రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది క్షతగాత్రులైనారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ట్రాఫిక్ సిబ్బందికి మైనర్ డ్రైవింగ్ పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశాలు జారీ చేశారు. మైనర్ డ్రైవింగ్ చేసే వారికి, వాహనాలు ఇచ్చిన వారి తల్లిదండ్రులకు సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

# ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

కొనరావుపేట : ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చెల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల వనభోజనాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కోసం ప్రజా సంక్షేమం కోసం పోరాడుతామని కార్యకర్తలు అందరికీ అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య మాజీ జెడ్పి చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి,ప్యాక్స్ చైర్మన్లు, రామ్మోహన్ రావు,మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్ మాజీ సర్పంచ్ వంశీ కృష్ణారావు మాజీ ఎంపీపీ మేకల రజిని బీఆర్ఎస్ మండల మహిళ అధ్యక్షురాలు



చిటీ సంధ్య మాజీ సర్పంచులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ భవనాల వైపు బుల్డోజర్లు

నల్గోండ: నల్లగొండలో అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చివేయాలనే హైకోర్టు ఆదేశాలతో గులాబీ పార్టీలో అలజడి మొదలైంది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా, హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన 33 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మించాలని భావించింది. ఇప్పటికే చాలా జిల్లాల్లో పార్టీ ఆఫీసులు నిర్మించగా, కొన్ని చోట్ల ఎలాంటి అనుమతులు తీసుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో అధికార కాంగ్రెస్ ఆయా భవనాలపై ఫోకస్ చేసింది.ముందుగా నల్గొండలో బీఆర్ఎస్ భవన్‌కు అనుమతులు లేవని? ఆ భవనాలను కూల్చేయాలని రెండు నెలల క్రితం రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హుకుం జారీ చేయడంతో తేనె తుట్టె కదిలింది. మంత్రి కోమటిరెడ్డి హెచ్చరికలతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఎదురుదెబ్బ తగిలింది. దీంతో నల్గొండతో సహా మిగిలిన చోట నిర్మించిన బీఆర్ఎస్ భవనాలపైనా బుల్డోజర్ యాక్షన్ ఉంటుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఏపీలో వైసీపీ ప్రధాన కార్యాలయానికి అనుమతులు లేవన్న కారణంతో రెండు నెలల క్రితం ఆ భవనాన్ని నేలమట్టం చేసింది ఏపీ ప్రభుత్వం. ఆ క్రమంలోనే ఇక్కడా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై కాంగ్రెస్ పార్టీ ఫోకస్ చేయగా, నల్గొండతోపాటు సూర్యాపేట, భువనగిరి, పెద్దపల్లి, మహబూబాబాద్, భూపాలపల్లి, హన్మకొండ, జనగామల్లో భవనాలకు అనుమతిలేదని అధికారులు గుర్తించారు. దీంతో ఆయా కార్యాలయాలకు అప్పట్లోనే నోటీసులు జారీ చేశారు. ఐతే నల్గొండ భవనం విషయమై బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించడంతో మిగిలిన భవనాలపైనా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు హైకోర్టు లైన్ క్లియర్ చేయడంతో నల్గొండ బీఆర్ఎస్ కార్యాలయం కూల్చివేతకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని చెబుతున్నారు. ఇదే సమయంలో మిగిలిన కార్యాలయాల వైపూ బుల్డోజర్లు వెళ్లనున్నాయా అన్న చర్చ జోరుగా సాగుతోంది.

తెలంగాణలోని అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలను నిర్మించాలని భావించిన ఆ పార్టీ హైకమాండ్? 2018లో రెండోసారి అధికారంలోకి వచ్చాక కొత్త జిల్లాల్లో పార్టీ కార్యాలయాలకు స్థలాలను కేటాయించింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు స్థలాలను కొనుగోలు చేసి ఆఫీసులు నిర్మించింది. ఇప్పటికే చాలా చోట్ల పనులు పూర్తయి కార్యాలయాలు ప్రారంభమయ్యాయి. ఎక్కడో ఒకటో రెండో మాత్రమే నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పుడు అనుమతులు లేవన్న కారణంతో ఆయా కార్యాలయాలను కూల్చివేస్తే బీఆర్ఎస్‌కు రాజకీయంగా దెబ్బేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో బీఆర్ఎస్ కార్యాలయాలను కూల్చివేస్తే ప్రతీకార రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వంపై ఆ పార్టీ విమర్శలు గుప్పించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. దీంతో ప్రభుత్వం భవనాల కూల్చివేతకే మొగ్గు చూపుతుందా? లేక రాజకీయ విమర్శలకు తావు లేకుండా ఇంకేమైనా చర్యలు తీసుకుంటుందా? అన్న సందేహాలు వ్యక్తవుతున్నాయి.ఇప్పటికే ఒకవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆకర్ష్ వల వేసిన కాంగ్రెస్?. 10 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంది. ఇప్పుడు ఏకంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కూల్చివేత వైపు ఫోకస్ చేస్తుండటంతో రాష్ట్రంలో రాజకీయం వేడెక్కె పరిస్థితి కనిపిస్తోంది. అక్రమ నిర్మాణాలైనా ప్రభుత్వం తలుచుకుంటే క్రమబద్ధీకరించే అవకాశం ఉంటుంది. కానీ, బీఆర్ఎస్ అధిష్ఠానంపై మానసికంగా పైచేయి సాధించాలనే ఆలోచనతో కార్యాలయాలను కూల్చివేస్తే అది ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశాన్ని పరిశీలిస్తున్నారు.మొత్తానికి కాంగ్రెస్ బుల్డోజర్ ముందుకు కదిలే అంశంలో ఎప్పుడేం జరుగుతుందో అన్న ఉత్కంఠ మాత్రం జోరుగా సాగుతోంది. అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత మొదలు పెడితే.. అది బిఆర్ ఎస్ కార్యాలయాలకే పరిమితం చేయడం సాధ్యం కాదు.. అలా ముందుకు వెళ్తే అనేక చోట్లు సామాన్యులు నిర్మించుకున్న భవనాలను కూల్చాల్సిన పరిస్థితి రావచ్చు.. దీంతో ప్రభుత్వం ఇప్పుడేం చేయబోతుందన్నది ఆసక్తిరేపుతోంది.

# గర్భిణీ మహిళలకు వైద్య సేవలను సమర్థవంతంగా అందించాలి

**– జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి ప్రతినిధి: జిల్లాలో ఉన్న ప్రతి గర్భిణి మహిళకు సంపూర్ణమైన వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రులలో సమర్థవంతం గా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గర్భిణీ మహిళలకు అందే వైద్య సేవల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణీల నమోదు తక్కువగా ఉందని, వారు పరిశీలించుకు ని ప్రతి గర్భిణీ స్త్రీ 100% రిజిస్టర్ అయ్యేలా చూడాలని, గర్భిణీ స్త్రీలు నమోదు కొరకు ఎల్.ఎం.పి లిస్ట్, నవ దంపతుల లిస్ట్ ప్రిపేర్ చేసి వారిని ట్రాక్ చేయాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీ మహిళల జాబితా ప్రతి సూపర్వైజర్ వద్ద ఉండాలని, గర్భిణీ స్త్రీలను సూపర్ వైజర్ మానిటరింగ్ చేయాలని, బర్త్ ప్లాన్ రూపొందించుకొని ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, కనీసం 80 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలో జరగాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 102 వాహనాలను ఉపయోగించు కొని గర్భిణీ స్త్రీలను పరీక్షలకు పంపాలని, ఏ రోజు ఏ గర్భిణి మహిళలను పరీక్షలకు తీసుకు రావాలో జాబితా తయారు చేసుకోవాలని, ఆ జాబితా ప్రకారం గర్భిణీ స్త్రీలకు తగు పరీక్షలు నిర్వహించుటకు మాత శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం నందు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు.ఎం.ఎల్.హెచ్.పి, హై రిస్క్ గర్భిణి కేసులను నెల ముందుగానే ఫాలో అప్ చేస్తూ అవసరమైన సమయంలో వెంటనే 108 వాహనంలో మాత శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి తరలించేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దపల్లిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీ డెలివరీ అయిన వారికి ప్రత్యేక ఏసీ రూములు రూసుము చెల్లించేవి ఉన్నాయని, అవసరమైన వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. విధి నిర్వహణలో సూపర్వైజర్లు సమయపాలన పాటించాలని, ఫీల్డ్ యందు డ్యూటీ సమయం ముగిసే వరకు ఉండాలని, సీనియర్ సూపర్వైజర్లు కూడా మెడికల్ అధికారి సూచనలు పాటించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రం నందు అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రణాళిక రూపొందించి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఫీవర్ సర్వేలో ఎక్కువ జ్వరాలు నమోదైన గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి సహకారంతో ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, వైరల్ జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ శ్రీధర్, ఎడిపిహెచ్ఓ డాక్టర్ అన్న ప్రసన్న, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణిశ్రీ, సూపర్వైజర్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఇద్దరికి త్వరలో రెడ్ కార్నర్ నోటీసులు..?

హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఏ1 ప్రభాకర్ రావు, ఏ6 శ్రవణ్ రావుపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని ఇంటర్ పోల్కు సీబీఐ, లేఖ రాసింది. హైదరాబాద్ పోలీసుల విజ్ఞప్తిని సీబీఐ అనుమతించింది. ఇంటర్ పోల్ ద్వారా ప్రభాకర్ రావు, శ్రవణ్రావులకు త్వరలో రెడ్ కార్నర్ నోటీసులు జారీ కానున్నాయి. కేసులో ప్రధాన నిందితులుగా భావిస్తున్న ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులు ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు గుర్తించారు.

కాగా ఇప్పటికే ప్రభాకర్ రావు పై కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. ప్రభాకర్రావు వర్చువల్ గా విచారణకు హాజరవుతారని కోర్టు దృష్టికి దర్యాప్తు బృందం తీసుకెళ్లింది. ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైన తర్వాత అమెరికాకు ప్రభాకర్ రావు వెళ్లిపోయిన విషయం తెలిసిందే. అమెరికాలో ఉన్న ఆయనను ఇండియాకు రప్పించేందుకు సీఐడీ ముమ్మరంగా ప్రయత్నిస్తుంది. ముందుగా ప్రభాకర్ రావు కు రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేసింది.

రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసిన విషయాన్ని సీబీఐకి, సీఐడీ అధికారులు తెలిపారు. సీబీఐ నుంచి ఇంటర్ పోల్ కి సీఐడీ అధికారులు సమాచారం అందజేశారు. అమెరికాలో ఉన్న ప్రభాకర్ రావుని ఇండియాకు రప్పించేందుకు సీఐడీ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇప్పటికే ప్రభాకర్ రావుపైన నాన్బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. ప్రభాకర్ రావుని హాజరుపరచాలని ఇప్పటికే నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఆరోగ్యం బాగోలేనందున విచారణకు హాజరు కాలేనని సిట్కు ప్రభాకర్ రావు తెలిపారు. ఇంటర్ పోల్ ద్వారా ప్రభాకర్ రావు ని హైదరాబాద్కు రప్పించేందుకు సిట్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అమెరికాతో సిట్కు ఉన్న ఒప్పందాల ప్రకారం ప్రభాకర్ రావు ని ఇండియాకు రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభాకర్ రావు ఒకవేళ విచారణకు హాజరైతే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు కీలకంగా ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ 6గా ఉన్న శ్రవణ్ రావు పైన కూడా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేశారు. శ్రవణ్ రావ్ ఎక్కడ ఉన్నారో తమకు తెలియదని కోర్టుకు సీఐడీ అధికారులు తెలిపారు. త్వరలోనే ప్రభాకర్ రావు శ్రవణ్ రావులని హైదరాబాద్కు రప్పించే ప్రయత్నం చేస్తున్నామని సిట్ అధికారులు చెప్పడం గమనార్హం

# నేను చనిపోలేదు నా పించన్ పైసల్ నాకు ఇవ్వండి.సార్

**బ్రతికుండగానే చనిపోయినట్లు నిర్ధారణ చేసి పింఛన్ ఆపిన అధికారులు**

**జిల్లా ఆఫీసులు. మండల ఆఫీసులు తిరిగినా కూడా ప్రయోజనం లేదు అంటున్న బాధితుడు**

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రం రఘునాథపాలెం గ్రామానికి చెందిన షేక్ గఫూర్ కు గత రెండు సంవత్సరాల నుండి పింఛన్ డబ్బులు రావడంలేదు. అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేసినా లాభం లేకుండాపోయింది. నువ్వు చనిపోయావు నీకు అందుకే పింఛన్ రావడం లేదని తేగేసి చెప్పారు. బతికుండగానే చనిపోయానని ఎలా నిర్ధారణ చేస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తూ బ్రతికున్న మనిషిని చనిపోయినట్లుగా నిర్ధారణ చేసిన ప్రతి ఒక్క అధికారిపై చర్యలు తీసుకోవాలని. తక్షణమే ఆయనకు వచ్చే పింఛన్ పైసలు ఇప్పటివరకు రావలసిన డబ్బులు మొత్తం ఆయనకు ఇవ్వాలని స్థానికులు డిమాడ్ చేస్తున్నారు..

మండల ఎంపీడీవో శ్రీనివాస్ ను వివరణ కోరగా రఘునాథపాలెం గ్రామానికి చెందిన షేక్ గఫూర్ అనే వ్యక్తి చనిపోయాడని చెప్పి పింఛన్ తొలగించిన విషయం నా దృష్టికి ఇప్పుడే రావడం జరిగింది. ఈ విషయాన్ని విచారణ జరిపి రెండు రోజులలో పరిష్కరించే విధంగా చూస్తానని వివరణ ఇచ్చారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యత

**–మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా**

**–స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో విద్యార్థులచే ప్రతిజ్ఞ**

మంథని: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపై ఉందని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమాసురేష్ రెడ్డి అన్నారు. శనివారం మంథని పట్టణంలోని కాకతీయ పాఠశాల విద్యార్థులతో మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమాసురేష్ రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సూపర్డెంట్ ఎన్ మనోహర్ స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్బంగా చైర్ పర్సన్ రమాసురేష్ రెడ్డి మాట్లాడుతూ పరిశుద్ధమైన, ఆరోగ్యవంతమైన భారత్ ను ఆవిష్కరించాలన్న మహాత్మా గాంధీ కలను నిజం చేసి చూపించాలని, ప్రజల్లో ప్రతి ఒక్కరూ చెత్తను వీధుల్లో వేయకుండా జాగ్రత్త పడడమే కాకుండా ఇతరులు కూడా చెత్త వేయకుండా చూడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమములో




కౌన్సిలర్లు వికె రవి, గుండా విజయలక్ష్మి పాపారావు, కాకతీయ స్కూల్ ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి లతో పాటు పాఠశాల సిబ్బంది విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంకిరెడ్డిపల్లి జడ్పీ హై స్కూల్ విద్యార్థులు, మహిళల రక్షణకు ఉన్న చట్టాల అవగాహనపాల్గొన్న త్రీటౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్

సిద్దిపేట: విద్యార్దులు అవసరమైన మేరకు మాత్రమే సోషల్ మీడియా ఉపయోగించాలి. చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దు. నూతన చట్టాలు మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగింది. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ అన్నారు. , మాట్లాడుతూ. కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ప్రత్యేక షెడ్యూల్లో భాగంగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

అంకిరెడ్డిపల్లి జడ్పీ హై స్కూల్ లో విద్యార్థులు, మహిళల రక్షణకు ఉన్న చట్టాల అవగాహన కార్యక్రమంలో అయన పాల్గొన్నారు.

విద్యాసాగర్ మాట్లాడుతూ సోషల్ మీడియా, సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి సైబర్ నేరాలు మన తప్పిదాల వల్లే జరుగుతున్నాయి గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులు ఓపెన్ చేయవద్దు, గూగుల్ పే ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించేటప్పుడు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి, బ్యాంకు అధికారులు ఎవరూ మన వివరాలు ఎప్పుడు కూడా అడగరు, బ్యాంకు ఖాతా ఓకే ఓపెన్ చేసేటప్పుడే మన ఆధార్ కార్డు పాన్ కార్డు అన్ని వివరాలు ఐడి ప్రూఫ్ తీసుకొని మనకు అకౌంట్ ఇస్తారు, వాళ్లు ఎప్పుడు కూడా ఆ వివరాలు అడగరు, ప్రతి ఒక్కరూ ఇది గమనించాలి. ఇలా అడిగి ఎవరైనా ఫోన్ చేస్తే తప్పకుండా సైబర్ నేరమని వెంటనే ఆ ఫోన్ కట్ చేసి వచ్చిన నెంబర్ ను బ్లాక్ చేయాలి. ఫైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. మీరు కానీ మీకు తెలిసిన వారు కానీ మీ బంధువులు కానీ ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ సెల్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని మరియు,100, 8712667434 పోన్ చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ గోపాల్ రెడ్డి, అధ్యాపకులు, సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ. మరియు తదితరులు పాల్గొన్నారు.


# గ్రామాలలో ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**–మహిళలు,చిన్న పిల్లల పట్ల మర్యాదగా నడుచుకోవాలి**

**–యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

**–మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లపల్లి రాజు**

మంథని: గ్రామాలలో ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే అట్టి వారి పై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లపల్లి రాజు అన్నారు. మంథని మండలంలోని గుంజపడుగు గ్రామంలో రామగుండం కమిషనర్ ఎం శ్రీనివాసులు ఆదేశానుసారం మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లపల్లి రాజు, మంథని ఎస్సై డ్యాగల రమేష్ ఆధ్వర్యంలో మంథని సర్కిల్లోని పోలీస్ సిబ్బందితో శనివారం కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి గ్రామంలోని స్థితిగతులను అడిగి తెలుసుకోన్నారు. అంతేకాకుండా సరైన పత్రాలు లేనటువంటి ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిపైన చాలాన్లు విధించారు. ఈ సందర్భంగా సిఐ రాజు మాట్లాడుతూ గ్రామంలోని యువత గంజాయి మరియు మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు.వాటి వల్ల కలిగే అనర్థాల గురించి వివరించి చెప్పారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా సేవించిన విక్రయించిన వారి వివరాలను పోలీసు వారికి చేరవేయాలని కోరారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చిన వారిపైన కూడా కఠినమైన



చర్యలు తీసుకోబడతాయని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థిని విద్యార్థులు ఎటువంటి గొడవలలో తలదూర్చకూడదని సూచించారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ఎవరైనా అనుచిత పోస్టులు పెట్టిన అట్టి వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళల పట్ల చిన్న పిల్లల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. మీకు ఎటువంటి సమాచారం తెలిసిన తక్షణమే 100 నెంబర్ కు కాల్ చేసి పోలీస్ ల సహాయం తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం మంథని ఎస్ఐ డ్యాగల రమేష్ సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. మీకు తెలియని ఏదైనా ఫోన్ నెంబర్ నుండి కాల్స్ కానీ మెసేజ్ కానీ వచ్చి మిమ్మల్ని ఏవైనా ప్రలోభాలకు గురి చేసిన వెంటనే మీరు 1930 నెంబర్ కు కాల్ చేసి పోలీసు వారి సహాయం పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రామగిరి ఎస్సై చంద్రకుమార్, ముత్తారం ఎస్సై నరేష్ లతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ విగ్రహంపై ఏర్పాటుపై పార్టీలోనే ...సెంటిమెంట్...

హైదరాబాద్: తెలంగాణ సచివాలయం ముందు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేసింది రేవంత్ రెడ్డి సర్కార్. ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాజీవ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మినహా ఇంకెవరు హాజరుకాలేదు. అయితే వారు రాకపోవడం వెనుక ఉన్న కారణాలని స్వయంగా సీయం రేవంత్ రెడ్డే చెప్పుకొచ్చారు.సచివాలయం ముందు రాజీవ్ విగ్రహం ఏర్పాటుపై తొలి నుంచి రాజకీయ వివాదం నడుస్తోంది. రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేసిన స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం భావించింది. ఐతే అనివార్య కారణాల వల్ల తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు జరగలేదు. ఇంతలో తెలంగాణలో బీఆర్ఎస్ సర్కార్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది.

దీంతో సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు సీఎం రేవంత్ రెడ్డి. అనుకున్నదే తడవుగా రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, ఆవిష్కరించడం కూడా జరిగిపోయాయి.తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేటాయించిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలోని కొందరు మంత్రుల నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న చర్చ జరుగుతోంది. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు.. సెంటిమెంట్ తో కూడకున్న వ్యవహారం కావడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఇదే అంశాన్ని నెత్తికెత్తుకున్న ప్రతిపక్ష బీఆర్ఎస్.. మరోసారి తెలంగాణ సెంటిమెంట్ ను రాజేసి ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టే ప్రయత్నం చేస్తోందని, ఇది తమకు ఎక్కడ ఇబ్బందికరంగా మారుతుందోననే ఆందోళన లో కొందరు మంత్రులు ఉన్నట్లు టాక్ నడుస్తోంది.గతంలో కేటాయించిన స్థలంలోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అదే ఆవరణలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేద్దామని క్యాబినెట్ లోనే కొందరు మంత్రులు సూచించారని సమాచారం. అది కాదంటే తెలుగు తల్లి ఫ్లైఓవర్ కూడలిలో రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మరికొందరు మంత్రులు చెప్పారట. ఐతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఆ ప్రతిపాదనలపై ఏమాత్రం సముఖత వ్యక్తం చేయలేదని తెలుస్తోంది. ఖచ్చితంగా సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామన్న స్థలంలోనే రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా మంత్రివర్గంలో తన నిర్ణయాన్ని ప్రకటించారనే టాక్ నడుస్తోంది.ఈ పరిస్థితుల్లో తాము అధికారంలోకి వస్తే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించి, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పదేపదే కేటీఆర్ చెప్తుండటాన్ని పలువురు మంత్రులు ప్రస్తావిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. భవిష్యత్తులో అదే గనుక జరిగితే రాజీవ్ గాంధీని స్వయంగా తామే అవమానించినట్లు అవుతుందని అమాత్యులు వాపోతున్నారట. ఇలాంటి రాజకీయ వివాదాల కారణంగానే రాజీవ్ విగ్రహ ఆవిష్కరణకు అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీతో ఏఐసీసీ నేతలు ఎవరూ రాలేదన్న చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారమంతా పార్టీ క్యాడర్ లోను, ప్రజల్లోనూ తప్పుడు సంకేతాలు తీసుకెళ్తోందని నేతలు చెబుతున్నారు.పైగా రాజీవ్ గాంధీ విగ్రహ రూపురేఖలపైనా విమర్శలు మొదలయ్యాయి. సచివాలయం ముందు ఏర్పాటు చేసిన రాజీవ్ విగ్రహం ఆయన పోలికలతో లేదంటూ కొందరు సోషల్ మీడియాలో వాపోతున్నారు. హడావుడిగా రూపొందించడం వల్లే ఇలా జరిగిందంటున్నారు. మొత్తానికి రాజీవ్ గాంధీ విగ్రహ ఏర్పాటు విషయంలో రేవంత్ రెడ్డి మంత్రివర్గంతోపాటు, కాంగ్రెస్ పార్టీలోనూ భిన్నాభిప్రాయులు వ్యక్తమవడం చర్చనీయాంశమవుతోంది. దీనికి ఎలాంటి ముగింపు వస్తుందో చూడాలి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**